ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 22 మార్చి 2025



మదనపల్లె మండలంలో ప్రారంభానికి సిద్ధంగా వున్న ఫారంపాండ్

పండుగ చేసుకో..!

- గృహ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్
- అదనపు సాయం.. బ్యాంకు ఖాతాలో
- రూ.15వేల నుంచి రూ.40వేలు జమ
- ఉగాది, రంజాన్‌లకు ప్రభుత్వం ఆఫర్
- జిల్లాలో 7,753 మందికి రూ.11.42 కోట్లు



మదనపల్లె మండలం పోతబోలు లేఅవుట్



మదనపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ శాఖకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆయా పథకాల్లో ఇదివరకే ఇల్లు మంజూరై ఆర్థిక ఇబ్బందులతో అర్ధాంతరంగా ఆపేసిన వారికి చేయూతనిచ్చింది. ఇందులో భాగంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఇస్తున్నట్లు ప్రకటించడమే కాదు.. అందుకు ఇటీవల మంత్రి వర్గం ఆమోదం తెలిపి జీవో కూడా జారీ చేసిన విషయం తెలిసిందే. అంతవరకూ బాగానే ఉన్నా.. ఇదంతా ఆలస్యం అవుతుంది.. అందుకు సంబంధించిన ఇంటి నిర్మాణం చేపడితేనే జమ చేస్తుందనుకున్నారు. కానీ.. అటు అబ్ధిదారులు, ఇటు అధికారుల అంచనాలు తారుమారు చేస్తూ, కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇదే నెలలో వరుసగా ఉగాది, రంజాన్ పండుగలు కూడా ఉండడంతో పండుగ ఆఫర్ ప్రకటించినట్లయింది. జీవో ఇచ్చి వారంరోజులు కూడా జరగకముందే గతంలో ఏ ప్రభుత్వమూ తీసుకోని నిర్ణయాన్ని తీసుకుంది. వెంటనే ఇదివరకే ఎస్సీ, బీసీ, ఎస్టీలకు ప్రకటించిన అదనపు సాయాన్ని ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసేసింది. ఇందులో ఇంటి నిర్మాణం స్టేజీని బట్టి రూ.15 వేల నుంచి రూ.40 వేలు మంజూరు చేసింది.

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట మున్సిపాలిటీలతో పాటు 30 మండలాల్లో 8,238 మంది హౌసింగ్ పథకంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలుగా గుర్తించారు. వీరికి రూ.12.15 కోట్లు చెల్లించేలా నిర్ణయించింది..కూటమి ప్రభుత్వం. ఇందులో భాగంగా వీరంతా 2005 నుంచి 2024 వరకూ వివిధ పథకాల్లో ఇల్లు మంజూరై వివిధ స్టేజీల్లో ఉన్నట్లు తేల్చారు. ఇందులో ఇంటి యూనిట్ విలువతో ప్రమేయం లేకుండా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు కూటమి ప్రభుత్వం అదనపు సాయాన్ని ప్రకటించింది. మొత్తమ్మీద వీరిలో వివిధ కారణాలతో 485 మంది లబ్ధిదారులకు రూ.73,17,500 సొమ్ములు పెండింగ్‌లో ఉంది. పేర్లలో వ్యత్యాసం బ్యాంకు ఖాతా నంబర్ తప్పుగా ఉండటం, తదితర సాంకేతిక కారణాలతో వారి ఖాతాలకు డబ్బులు జమ కాలేదు. మిగిలిన 7,753 మందికి సంబంధించి రూ.11.42 కోట్లు జమ చేసింది. మొదట్లో వీరందరికీ తర్వాత నిర్మించుకునే స్టేజీని బట్టి ఆ అదనపు సొమ్ము ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయాలకు కూడా విధి విధానాలు జారీ చేసింది. వీటిని అమలుకు ఉపక్రమించే లోపే ఉన్నట్లుండీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అదనపు సాయాన్ని అడ్వాన్సుగానే ఇచ్చేసింది. ఈ మేరకు హౌసింగ్ లబ్ధిదారుల ఖాతాలకు శుక్రవారం జమ చేయడంతో వారి ఆనందానికి హద్దు, అవధులు లేకుండా పోయాయి.

లబ్ధిదారులకు అదనపు సాయం అందించే క్రమంలో హౌసింగ్ అధికారులు కులాల వారీగా లబ్ధిదారులు, వారి స్టేజీని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే ఆయా ఇంటి స్టేజీని ఎంబుక్‌లో రికార్డు చేసి, వాటిని అప్‌లోడ్ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలు చేసే లోపే సాయంత్రానికి లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వమే గుర్తించేసింది. జీఎస్‌డబ్ల్యూ సర్వీసులోని కూలాల ఆధారంగా మ్యాప్ చేసి సొమ్ములు విడుదల చేసినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో గోడలు, మోల్డింగ్ పూర్తి చేసిన వారికి రూ.30వేలు, పునాది పూర్తి చేసిన స్టేజీకి రూ.15వేలు, నిర్మాణం పూర్తయిన ఇంటికి రూ.40వేలు లబ్ధిదారుని ఖాతాకు జమ అయింది. ఒక స్టేజీ పూర్తి చేసిన వారికి రూ.15వేలు పడితే, పూర్తయిన ఇంటికి మొత్తం రూ.40వేలు పడింది.

2022, మార్చిలోనూ ఇదే తరహాలో కేంద్రం ప్రభుత్వం రూ.20వేలు అడ్వాన్సు ప్రకటించి స్టేజీని బట్టి రూ.10వేలు, రూ.20వేలు లబ్ధిదారుల ఖాతాకు జమ చేసింది. ఇది అప్పట్లో లబ్ధిదారులకు గుడ్ న్యూస్ అయినా..తర్వాత హౌసింగ్ అధికారులు, వార్డు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అధికారులకు తలనొప్పి తెచ్చిపెట్టింది. అడ్వాన్సు డబ్బు తీసుకున్న డబ్బులను అప్పట్లో చాలా మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ఉపయోగించలేదని క్షేత్రస్థాయి సర్వేలో తేలింది. తర్వాత అది క్షేత్రస్థాయి సిబ్బందికి రికవరీ వచ్చే అవకాశం ఉందన్న నేపథ్యంలో నిర్ణీత స్టేజీ వరకూ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దాన్ని గుర్తు చేసుకుంటున్న అధికారులు ప్రస్తుతం అదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అడ్వాన్సుగా డబ్బులు జమ చేసిందని, తర్వాత ఆయా స్టేజీని పూర్తి చేయించే బాధ్యత నెత్తిన పెడుతుందేమోనని ఆ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆర్థిక ఏడాది ముగుస్తున్న నేపథ్యంలో కేంద్రం నుంచి నిధులు సమకూర్చుకునే పనిలో భాగంగా ముందస్తుగా సొమ్ములు జమ చేసిందని చెబుతున్నారు.

జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు

- 392 మందిని స్థానచలనం చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ

రాయచోటిటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ సంఖ్యలో పోలీసులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్లలో గడిచిన 5 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న పోలీసులను లాంగ్‌స్టాండ్ కింద బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ క్రమంలోనే జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న 41 మంది ఏఎ్‌సఐలను, 123 మంది హెడ్‌కానిస్టేబుళ్లను, 228 మంది కానిస్టేబుల్స్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు బదిలీ అయిన ప్రాంతాల్లో రిపోర్ట్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇంత భారీ సంఖ్యలో పోలీసులను బదిలీ చేసిన సందర్భాలు లేవు. అయితే జిల్లా వ్యాప్తంగా ఇటీవల కాలంలో కొన్ని వర్గాల మధ్య చోటు చేసుకుంటున్న సంఘటనలు, హత్యలు, ఆత్మహత్యలు, దాడులు, జూదాలు, గంజాయి విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాల్లో లాంగ్ స్టాండర్డ్‌గా ఉన్న పోలీసుల పాత్ర అక్కడక్కడ ఉన్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ భారీ సంఖ్యలో పోలీసులను బదిలీ చేయడంలో జిల్లా వ్యాప్తంగా పలు అంశాలపై ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలతో పాటు నేరాల కట్టడికి ఎస్పీ ప్రత్యేక దృష్టి సారిస్తుండడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు 'ఫారంపాండ్ల' పండుగ ప్రారంభం

- జిల్లాలో 11,044 తవ్వకమే లక్ష్యం
- కర్నూలులో ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్

మదనపల్లెటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీ గోకులాలు, ప్రభుత్వ పాఠశాలల ప్రహరీల నిర్మాణం ఒక యుద్ధంలానే మొదలు పెట్టి పూర్తి చేస్తున్నారు. ఇప్పుడు ఉపాధి కూలీలకు అవకాశం కల్పించడం, సన్నకారు రైతులకు ఉపయోగపడేలా 'ఫారంపాండ్ల' తవ్వకాలను యుద్ధప్రాతిపదికన ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో 1.05 లక్షల ఫారంపాండ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఈ పనులను ప్రారంభించడానికి డిప్యూటీ సీఎం నేడు కర్నూలు జిల్లాకు వస్తున్నారు.

జిల్లాలో 11,044 ఫారంపాండ్లకు గ్రౌండింగ్

జిల్లాలోని 30 మండలాల్లో 11,044 ఫారంపాండ్ల తవ్వకాలకు నేడు గ్రౌండింగ్ చేయనున్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 7,432 ఫారంపాండ్లు మంజూరు కాగా అందులో అత్యధికంగా వాల్మీకిపురం మండలంలో 710, అత్యల్పంగా నందలూరు మండలంలో 54 ఫారంపాండ్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటి వరకు 3,025 ఫారంపాండ్లు తవ్వకాలను (గ్రౌండింగ్) ప్రారంభించగా, నేడు 1,860 ఫారంపాండ్ల తవ్వకాలను ప్రారంభించనున్నారు.

ఫారంపాండ్ల ఉపయోగాలు

సన్నకారు రైతుల పొలాల్లో నిర్మించే ఈ ఫారంపాండ్లతో ఎన్నో ఉపయోగాలు వున్నాయి. ముఖ్యంగా వర్షం కురిస్తే పొలంలో కురిసే వర్షపు నీరు వాలుగా వెళ్లి వంకల్లో కలుస్తాయి. అలా వెళ్లే ఈ నీటిని ఒడిసి పట్టి పొలంలో లోతట్టు ప్రాంతంలో నిల్వ చేసేందుకు ఫారంపాండ్లు ఉపయోగపడతాయి. 10 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో రెండు అడుగుల లోతు చొప్పున మూడు స్టెప్పులుగా ఫారంపాండ్లను తవ్వుతారు. ఎకరా పొలం వుండే చోట 8 అడుగుల వెడల్పు, 8అడుగుల పొడవు, రెండు స్టెప్పులతో ఫారంపాండ్లను తవ్వుతారు. ఎటువంటి యంత్రాల సహాయం లేకుండా కేవలం ఉపాధి హామీ కూలీలతోనే ఈ ఫారంపాండ్లు తవ్వుతారు. ఈ ఫారంపాండ్లలో నిల్వ వున్న నీటితో భూగర్భజలాలు పెరుగుతాయి. ఫారంపాండ్లలో నిలిచే వర్షపు నీటితో చుట్టుపక్కల ఉద్యానవనాలకు సాగునీరు పంపింగ్ చేయవచ్చు. దీంతో పాటు భూసారం పెరిగే అవకాశం వుంటుంది.

అధికారులకు దిశానిర్దేశం

జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీకి 25 ఫారంపాండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకుని పనులు చేస్తున్నారు. 493 గ్రామ పంచాయతీల్లో 11,044 ఫారంపాండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ నెలాఖరులోగా ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి కలెక్టర్, డ్వామా పీడీకి దిశానిర్దేశం చేశారు. డ్వామా పీడీ కూడా రోజూ ఒక మండలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫారంపాండ్ల పనులు వేగవంతం చేసేలా ఉపాధి హామీ సిబ్బందికి సూచనలిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,025 ఫారంపాండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో వుండగా, 1,193 ఫారంపాండ్లు పూర్తయ్యాయి.

ఎన్నికల బలోపేతానికి సూచనలు ఇవ్వండి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి చట్టానికి అనుగుణంగా సూచనలు, సలహాలు అందజేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగం అమలులో రాజకీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఎన్నికల ప్రక్రియ గురించి ఈఆర్‌వో, డీఈవోల స్థాయిలో పరిష్కారం కానీ ఏవైనా సమస్యలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి ఏప్రిల్ 30 నాటికి సూచనలు, సలహాలు అందజేయాలని కోరారు. వయోజనులు, యువత ఓటర్ల నమోదు శాతం పెరిగేందుకు కూడా రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో ఉన్న ఈవీఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రెడ్డెప్పరెడ్డి, తహసీల్దార్ నరసింహ కుమార్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రాయచోటిటౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణను తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు పదవ తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా విద్యాశాఖ అధికారులు రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ లేకనే కేసులు తగ్గాయి

- జిల్లా ఫారెస్ట్ అధికారి జగన్నాథ్‌సింగ్

బి.కొత్తకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం రవాణాకు కేంద్రబిందువైన చైనాలో ఐదు కంపెనీలు మూతపడడం వల్ల మన ప్రాంతంలోనూ ఎర్రచందనం కేసులు బాగా తగ్గిపోయాయని జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాథ్‌సింగ్ పేర్కొన్నారు. వైల్డ్‌లైఫ్, కోర్టుకేసులు, అగ్నిప్రమాదాలు, అటవీశాఖ చట్టాలు తదితర అంశాలపై బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌లో అటవీశాఖ అధికారులకు ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. అటవీప్రాంతంలో చెట్లు, భూభాగం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీచట్టంలో మార్పులు, సిబ్బంది అధికారాల గురించి ఉన్నతాధికారులు వివరించారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డీఎఫ్‌ఓ విలేఖరులతో మాట్లాడుతూ వన్యప్రాణి సంరక్షణా చట్టం నిబంధనలను కఠినతరం చేశామని, వన్యప్రాణులకు హాని తలపెట్టి కేసుల్లో ఇరుక్కుంటే చాలా కష్టమన్న విషయం అందరూ గుర్తించాలన్నారు. రూ.లక్ష వరకు జరిమానా, జైలుశిక్ష కాలం కూడా పెంచుతారన్నారు. కేరళ పెరియార్ టైగర్ రిజర్వ్ తరహాలో హార్సిలీహిల్స్‌లో ట్రెక్కింగ్, నైట్ పెట్రోలింగ్, హైకింగ్, టెంట్‌సిటీల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పెట్టబోతున్నామని హిల్స్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల ఆకర్షణకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరుల్లో నగరవనాల అభివృద్ధికి నిధులు విడుదలయ్యాయని తెలిపారు. జిల్లాలో వనమహోత్సవం, వనం-మనం కార్యక్రమాల ద్వారా పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె, రైల్వేకోడూరు సబ్‌డీఎఫ్‌ఓలు శ్రీనివాసులు, సుబ్బరాజు, బాలరాజు, వైల్డ్‌లైఫ్ సెంట్రల్‌క్రైం బ్యూరో ఆదిమల్లయ్య, రేంజ్‌ఆఫీసర్లు, సెక్షన్‌ఆఫీసర్లు పాల్గొన్నారు.




హార్సిలీహిల్స్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ జగన్నాథ్‌సింగ్

నిలువెల్లా నిర్లక్ష్యం

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా సుండుపల్లె మండల రైతుల పరిస్థితి తయారైంది. ఝరికోన ప్రాజెక్టులో నీరున్నా నిరుపయోగంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో కనీసం కాల్వల నిర్మాణానికి కూడా నోచుకోకుండా పోయింది. దీంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రాజెక్టు మొరవ





ఝరికోన ప్రాజెక్టు

- సమస్యల నడుమ ఝరికోన ప్రాజెక్టు
- కాలువల ఏర్పాటుకు ఎదురుచూపులు
- మట్టి, కాంక్రీట్‌తో తూము మూసివేత
- కూటమి ప్రభుత్వంలోనూ ముందుకు పడని అడుగు



మట్టి, కాంక్రీటుతో తూము మూసిన వైనం



మరమ్మతులకు నోచుకోని తూము

సుండుపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సుండుపల్లె, సంబేపల్లె ప్రాంతాల తాగు, సాగునీటి కోసం ఝరికోన ప్రాజెక్టు నిర్మించారు. అయితే, కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రాజెక్టు దిగువ భాగంలోని రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బాహుదా జలసాధన జల సంరక్షణ సమితి పోరాటాల ఫలితంగా ప్రాజెక్టుకు తూము ఏర్పాటు చేశారు. సుమారు 8ఏళ్ల క్రితం దానికి గేటు కూడా అమర్చారు. అయితే దానికి సంబంధించిన కడ్డీ విరిగిపోవడంతో, గేటు తొలగించి బాహుదా నదిలోకి నీరు పోకుండా, తూములోకి నీరు రాకుండా ప్రాజెక్టులో కాంక్రీటు వేశారు. అప్పటి నుంచి గేటు మరమ్మతులను పట్టించుకోలేదు. దీంతో రైతులు అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గతేడాది జూలైలో సుండుపల్లె మండల రైతులు సాగునీటి సమస్యను కూటమి నేతలు, నీటి పారుదలశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సైఫన్ పద్ధతిలో జలాశయంలోని నీరు దిగువకు వచ్చేలా చేశారు. 15 రోజుల తరువాత గుర్తు తెలియని వ్యక్తులు సైఫన్‌కు సంబంధించిన ప్లాస్టిక్ పైపులను కోసేశారు.

అనుమతులు రాలేదు..

గత ప్రభుత్వంలో రూ.59 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. అప్పట్లో ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను.

- రాజన్న, ఏఈ, ఝరికోన ప్రాజెక్టు

ప్రభుత్వం ఏదైనా స్పందన కరువు

దశాబ్దాలుగా కాల్వల ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రత్యక్షంగా 5 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఎటువంటి ముందడుగు పడలేదు. అప్పట్లో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లలేకపోయారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారే కానీ ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎటువంటి ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
రాయచోటి	6.30	4.57
మదనపల్లె	6.32	5.04
రాజంపేట	6.29	5.05
పీలేరు	6.30	4.56

ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ డ్రా నేడే

(కడప-ఆంధ్రజ్యోతి): మా అక్షరం మీ ఆయుధం అంటూ ఆంధ్రజ్యోతి పునఃప్రారంభమై 22 ఏళ్ల పూర్తి చేసుకుంది. జనాదరణే తన ఊపిరిగా చేసుకున్న ఆంధ్రజ్యోతి.. దమ్మున్న వార్తలతో తెలుగునాట రెండు రాష్ట్రాలలో 19 యూనిట్లు బెంగళూరుతో కలిపి 20 యూనిట్ల నుంచి వెలువడుతోంది. ఇదంతా పాఠకుల ఆదరణతోనే సాధ్యమైంది. 22 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా తమను ఆదరిస్తున్న పాఠకులు, సరికొత్త పాఠకుల కోసం కోటి రూపాయల బహుమతులు అందజేసేందుకు ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు ఒక్కో మారుతి స్విఫ్ట్ కారు, ప్రతి యూనిట్‌లో మొదటి బహుమతి మోటార్ బైక్, రెండవ బహుమతి 185 లీటర్ల రెఫ్రిజిరేటరు, మూడో బహుమతి 32 అంగుళాల టీవీ అందించనున్నారు. ఈ మేరకు పాఠకుల నుంచి వచ్చిన కూపన్ల నుంచి శనివారం సాయంత్రం 4.30 గంటలకు కడప యూనిట్‌లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేయనున్నారు. ఇవి కాకుండా మరో వంద మందికి కన్సొలేషన్ బహుమతులు అందించనున్నారు. ఇక్కడ మొదటి, రెండవ, మూడవ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు పొందిన 100 మంది కూపన్లు బంపర్ డ్రాకు తీసుకోరు. మిగిలిన కూపన్లను ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ లోపు విజయవాడలో జరిగే బంపర్ డ్రాలో కలుపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన అన్ని కూపన్ల నుంచి బంపర్ డ్రాలో ఒక్కరిని మారుతి స్విఫ్ట్‌కారు వరించనుంది. కాగా ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా పరిధిలోని పాఠకులు శనివారం సాయంత్రం కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చిన్నమాచుపల్లెలో ఉన్న ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయానికి హాజరుకావాలి.



కలెక్టరేట్‌లో పోలీసుల మాక్ డ్రిల్



కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి21(ఆంధ్రజ్యోతి): బాంబు బెదిరింపు వస్తే ఎలా స్పందించాలనే అంశంపై శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. హుటాహుటిన జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న పోలీసులు, ఉద్యోగులను బయటకు పంపి కార్యాలయంలో అణువణువు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ చలపతి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు ఎలా వ్యవహరించాలన్న అంశంపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు సహాయపడతాయన్నారు. అనంతరం బాంబు బెదిరింపు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎక్కడైనా ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసులకు ప్రజలు సహరించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వీజే రామకృష్ణ, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

బి.కొత్తకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లె పంచాయతీ పరిధిలోని కనికలతోపు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి(60) మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం అతని కాళ్లమీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడి వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న బి.కొత్తకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్ బాబు తెలిపారు.

కృష్ణ జింకకు గడ్డుకాలం!

కృష్ణ జింకలకు గడ్డుకాలం దాపురించింది. అడవుల్లో మేత...నీటి లభ్యత లేకపోవడం వాటి మనుగడకు శాపంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలు, కుక్కల బారిన పడి ఏటా వంద దాకా ప్రాణాలు కోల్పోతున్నాయి. రాష్ట్ర అధికారిక జంతువైన కృష్ణ జింకల సంఖ్య ఈ ప్రాంతంలో విపరీతంగా పెరుగుతున్నా తగిన వసతులు కల్పించడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. అడవుల్లో ఉన్న జల వనరులు అడుగంటి పోతుండగా.. దుస్థితికి చేరిన తొట్టెలలో నీరు నిలవడం లేదు. మేత కూడా కరువైంది. ఫలితంగా జింకలు మేత, నీరు వెతుక్కుంటూ వస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి.. ప్రస్తుతం వేసవి ముంచుకొస్తుండడంతో అడవుల్లో నీరు దొరక్క జింకలు దాహంతో అలమటించి మృత్యువాత పడే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.



సండ్ర అడవిలో ఎండిపోయిన పాపన్న కుంట



రోడ్డు ప్రమాదం, కుక్కలబారిన పడి మృతి చెందిన జింకలు (ఫైల్‌ఫొటోలు)

- మేత, నీటి కోసం జనారణ్యాలకు..
- రోడ్డు ప్రమాదాలు.. కుక్కల బారిన పడి మృతి
- అడవుల్లో అడుగంటిన జలవనరులు..
- దుస్థితిలో సాసర్‌పిట్‌లు, బోర్లు
- వేసవిలో జటిలం కానున్న నీటి సమస్య..

ములకలచెరువు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజవర్గంలోని ములకల చెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె మండలాల్లో జింకలు మందలు మందలుగా సంచరిస్తూ ఉంటాయి. ప్రస్తుతం వీటి సంఖ్య సుమారు 30 నుంచి .40వేల వరకు ఉండవచ్చని అటవీశాఖ అధికారుల అంచనా.. ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద తిప్పసముద్రం మండలాల్లో సండ్రడివి, కను గొండ, నల్గొండ, మొతుకుమల రిజర్వు ఫారె స్టు 3,204 హెక్టార్లలో విస్తరించి ఉంది. ఈ రిజర్వు ఫారెస్టులో జింకల సంచారం అత్యధికంగా ఉంది. కొన్నేళ్ళుగా నిర్వహణ లేకపోవడంతో అటవీ ప్రాంతంలోని కుంటలు, చెలమలు పూడిపోయి వాటిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, ఎండల తీవ్రత కారణంగా ప్రతి ఏటా ఆడవుల్లోని నీటి వనరులు వట్టిపోతున్నాయి. దీనికి తోడు మేత దొరడం కష్టంగా మారింది. దీంతో జింకలు ఆడవులను వదిలి పొలాల వద్దకు పొలాల వద్దకు వస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై, కుక్కల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ములకలచెరువు మండల పరిధిలోని అటవీప్రాంతం సమీపంలో 20 కిలో మీటర్లకు పైగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారి ఉంది. పెద్దతిప్పసముద్రం మండలంలో 30 కిలో మీటర్లు, బి.కొత్తకోటలొ 15 కిలో మీటర్లు, తంబళ్ళపల్లె మండలంలో 15 కిలోమీటర్లుదాకా అటవీ ప్రాంతానికి ఆనుకుని రోడ్లు ఉన్నాయి. మేత, నీటి కోసం వచ్చిన వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో వాహనాల కింద పడి ఏటా 60 నుంచి వంద వరకు ప్రాణాలు వదులుతున్నాయి. గ్రామ పరిసరాల్లోకి వస్తే కుక్కలు దాడి చేసి చంపేస్తున్నాయి. పొలాల్లో మోతాదుకు మించి వాడుతున్న క్రిమిసంహారక మందులు కూడా జింకల ప్రాణాలు తీస్తున్నా యి. .



సండ్రఅడవిలో నిరుపయోగంగా మారిన చేతి పంపు, సాసర్‌పిట్

నీటి తొట్టెలున్నా...

సండ్రడివి రిజర్వు ఫారెస్టులో వన్యప్రాణులు, జింకలకు తాగునీటి వసతి కల్పించేందుకు అటవీశాఖ 12 నీటి తొట్టెలు ఏర్పాటు చేసింది. ఈ తొట్టెలన్నీ దెబ్బతినడంతో, నీరు నిలువ ఉండడం లేదు. అడవిలోని చేతి పంపు చెడిపోయి ఏళ్ళు గడుస్తున్నా మరమ్మతులు చేయించలేదు. పాపన్న కుంట పూడికతో నిండి పోయింది. కనుగొండ, నల్గొండ, మొతుకుమల అడవుల్లో ఉన్న నీటి వనరులు కూడా వట్టిపోతున్నాయి.

ముందు చూపు లేకే..

జింకల సంరక్షణలో అటవీశాఖ ఉన్నతాధికా రుల చొరవ కరువైంది. ప్రధానంగా ములకల చెరువు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, పెద్ద తిప్పసముద్రం మండలం కందకూరు సమీపంలో జింకలు తిరిగే ప్రాంతమని.. వాహనాలు నెమ్మదిగా వెళ్ళాలని సూచిస్తూ పదేళ్ల క్రితం బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డులపై అక్షరాలు కనిపించడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి జింకలు సంచరించే ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా నీటిని నింపాలి. వర్షాకాలంలో మేత బీళ్లలో విత్తనాలు చల్లించాల్సి ఉంది. లేదంటే భవిష్యత్తులో వీటి సంఖ్య తగ్గిపోయే ప్రమాదం లేకపోలేదు.

తొట్టెల్లో నీరు నిలవడం లేదు



సండ్రడివిలో అటవీశాఖ ఏర్పాటు చేసిన తొట్టెల్లో నీరు నిలవడం లేదు. వర్షం కురిసినా, ట్యాంకర్లతో నీరు పట్టినా గంటల వ్యవధిలో ఇమిరిపోతున్నాయి. ప్రస్తుతం ఉన్న నీటి తొట్టెలకు మరమ్మతు లతో పాటు, మరిన్ని నిర్మిస్తే బాగుంటుంది.

- ఆంజనేయులు, దారంవాండ్లపల్లె, గొర్రెల కాపరి

నీటి కొరత లేకుండా చూస్తున్నాం



వేసవిలో కొరత లేకుండా నీటి వసతి కల్పిస్తాం. ప్రస్తుతం కూడా సాసర్ పిట్స్ లో నీరు నింపుతున్నాం. ఎక్కడైనా తొట్టెలు మరమ్మతులకు గురైవుంటే తక్షణం బాగు చేయాలని ఆదేశించాం. అడవులు, కొండలకు నిప్పు పెడితే చర్యలు తప్పవు.

-జయప్రసాదరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మదనపల్లె



ములకలచెరువు సమీపంలో ఏర్పాటు చేసిన బోర్డుపై చెరిగిపోయిన అక్షరాలు

27నుంచి దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

కలికిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూ రు వ్యవసాయ వర్సిటీ లాం ప్రాంగణంలో ఈ నెల 27 నుంచి 29 వరకూ దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఆచార్య ఎన్జీ రంగా, కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శనలో ఏపీ, తెలంగాణా, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, కర్ణాటక మరియు లక్షద్వీప్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రైతులు, రైతు సహకార సంఘాలు, ఎన్జీవోలు పాల్గొననున్నారు. ప్రదర్శనలకు సంబంధించి 200 పైగా విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో నూతన వంగడాల ప్రదర్శన, నూతన సాంకేతిక పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, వ్యవసాయ యాంత్రీ కరణ, ఉద్యాన, పాడి, మత్స్య రంగాల్లో నూతన సాంకేతికతల ఆవిష్కరణలుంటాయి. ఆసక్తి ఉన్న అన్నమయ్య జిల్లాలోని రైతులు పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తున్నారు. కేవీకే సమన్వయంతో ఈ ప్రదర్శనకు రైతులు హాజరు కావచ్చు. ఈ లోగా 8008500320నంబరును సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవడం తోపాటు వివరాలను కూడా తెలుసుకోవచ్చు.

ఉపాధి ఏపీవోల బదిలీ

మదనపల్లె టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఉపాధి హామీ పథకంలో ఏపీవోలుగా పనిచేస్తున్న పలువురి ని ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు తెలిసింది. దీర్ఘకాలంగా ఒకే మండలంలో పనిచేస్తున్న ఏపీవోలకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. వీరిలో మదనపల్లె ఏపీవో సుబ్రమణ్యంను కురబలకోటకు, కురబలకోట ఏపీవో వెంకటేశ్వరను బి.కొత్తకోటకు, బి.కొత్తకోట ఏ పీవో మంజులను కలికిరికి, పెద్దమండ్యం ఏపీవో మురళీమోహన్‌ను చిన్నమండ్యంకు, కలికిరి ఏపీవో సు జాతను కలకడకు, కలకడ ఏపీవో చెన్నకేశవులను మదనపల్లె మండలానికి బదిలీ చేశారు. వీరబల్లి మండలం ఏపీవో నాగరాజను చిట్వేలికి, చిట్వేలి మండలం ఏపీవో చంద్రకళను వీరబల్లికి, రామాపురం మండలం ఏపీవో సురేంద్రరెడ్డిని పెద్దమండ్యం కు బదిలీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. శనివారం జిల్లా వ్యాప్తంగా ఫారంపాండ్ల గ్రౌండింగ్ పనులు ప్రారంభం కానున్న క్రమంలో ఈ బదిలీ ఉత్తర్వులను తాత్కాలికంగా ప్రకటించలేదని సమాచారం. మరో రెండు రోజుల్లో ఈ బదిలీల ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉంది.

సోమవరం గ్రామ సర్వేయర్‌పై సస్పెన్షన్ వేటు

వీరబల్లి, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామ సర్వేయర్ రాఘవేంద్రపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈయన విధుల పట్ల అలసత్వం వహించడంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేకు హాజరు కాకపోవడంలేదని అధికారులు కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సస్పెన్షన్ చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులు శుక్రవారం వీరబల్లి తమ కార్యాలయానికి అందినట్లు తహసీల్దార్ వెంకటేశు తెలిపారు.

ఐపీ పెట్టినా వేధింపులు ఆగలేదు

● రుణదాతలకు వినూత్న రీతిలో బాధితుడి వినతి



వడ్డీ వ్యాపారులకు విజ్ఞప్తి చేస్తూ పెట్టిన బ్యానర్

రైల్వేకోడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ భరించ లేక ఐపీ పెట్టినా వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఆగలేదని శుక్రవారం రైల్వే కోడూరు పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు సమీపంలో ఉన్న ఓల్డ్ ఐరన్ మార్ట్ యజమాని మోహన్‌రాజు వినూత్న ఆందోళన చేశారు. మోహన్‌రాజు కథనం మేరకు.. ఐపీ పెట్టినా వడ్డీ వ్యాపారులకు అధిక వడ్డీలు చెల్లించినా వారు తీవ్రంగా వేధిస్తున్నారని, గతంలో చాలా మంది వడ్డీ వ్యాపారులకు సక్రమంగా డబ్బులు చెల్లించినా తనను విడిచి పెట్టకుండా వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తన దుకాణం వద్ద బ్యానర్ పెట్టి వడ్డీ వ్యాపారులకు ఇంక అసలు, వడ్డీ డబ్బులు చెల్లించలేనని, తన ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేదని, మానసికంగా ఆందోళన చెందుతున్నట్లు బ్యానర్‌లో పేర్కొన్నాడు. వడ్డీ వ్యాపారులు తనను ఇంకా వేధిస్తే ఆత్మహత్య తప్ప వేరే మార్గం కనిపించలేదని అప్పులు ఇచ్చిన వారికి విజ్ఞప్తి చేశాడు. పోలీసులు దీనిపై స్పందించి వడ్డీ వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఆకతాయి చర్యకు మర్రి వృక్షం దగ్ధం



దగ్ధమవుతున్న మర్రిచెట్టు

గుర్రంకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పంటించడంతో దశాబ్దాల నాటి భారీ మర్రి వృక్షం అగ్నికి ఆహుతైంది. స్థాని కులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని మర్రిమాకుల పల్లెకు పశ్చిమాన కోట ఉంది. ఈ కోటలో పురాతనమైన భారీ వృక్షాలున్నాయి. ఇలాంటి వాటిలో ఓ మర్రివృక్షం తొర్రలో ఓ వ్యక్తి చెత్తవేసి నిప్పంటించాడు. ఈ నిప్పు రవ్వలు అంటుకొని మొద్దు మొత్తం కాలిపోవడంతో భారీ వృక్షం బూడిదగా మారింది. వినాయక చవితి, సంక్రాంతి పండుగ ల రోజున గ్రామస్థులు ఈ వృక్షం వద్ద పూజలు చేసేవారని ప్రజ లు చెబుతున్నారు. ఈ విష యం అధికారులకు తెలిపినా పట్టిం చుకోలేదని రైతులు, ప్రజ లు వాపోతున్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

కలికిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ఒక ఆటో బోల్తా పడటంతో 8 మంది గాయపడ్డారు. కలికిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోళ్ళతోపు వడ్డెపల్లెకు చెందిన మహిళా కూలీలు శుక్రవారం ఉదయం కేవీ పల్లె మండలంలోని తిమ్మాపురానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలో కుక్కలు అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో గాయపడిన వారికి స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేశారు. తీవ్రంగా గాయపడిన గంగులమ్మ, వెంకటలక్ష్మి, సరస్వతి, లోకేశ్‌ను మెరుగైన వైద్యం కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిలో ఈశ్వరమ్మ, మంగమ్మ, గంగాదేవి, లక్ష్మీదేవి ఉన్నారు. కలికిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ షాపులపై దాడులు

రాజంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాములు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. జాతీయ స్థాయిలో నిషేదించిన మందులను అమ్ముతున్నారా అనే అంశాన్ని అన్ని షాపుల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు పదికి పైబడి షాపుల్లో ఉన్న మందులన్నింటిని క్షుణ్ణంగా ఆరా తీశారు. అందుకు సంబంధించిన బిల్లులను కూడా పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్త తనిఖీ ల్లో భాగంగా ఈ దాడులు నిర్వహించారు.

టిప్పర్, కంటైనర్ లారీ ఢీ

- టిప్పర్ డ్రైవర్ మృతి
- కంటైనర్ లారీ డ్రైవర్ పరిస్థితి విషమం



కంటైనర్ లారీని ఢీకొన్న టిప్పర్, (ఇన్‌సర్ట్) శివ మృతదేహం

పుల్లంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కంటైనర్ లారీ, టిప్పరు ఢీకొన్న ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ మృతి చెందగా కంటైనర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. రాజంపేట మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన చీమకుర్తి శివ(35) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. శుక్రవారం మంగంపేట నుంచి రాజంపేటకు టిప్పర్‌లో వెళుతూ ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే యత్నంలో మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో గుజరాత్ నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ లారీని బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందగా కంటైనర్ డ్రైవర్ పాండు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే, రూరల్ సీఐ రమణ, పుల్లంపేట ఏఎస్ఐ పిచ్చయ్య తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ కంటైనర్ డ్రైవర్‌ను రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. టిప్పర్‌లో ఇరుక్కుపోయిన శివ మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీసి రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా రెండు భారీ వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో దాదాపు 3 గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఏఎస్పీ, సీఐలు, ఏఎస్ఐలు ఎక్స్‌కవేటర్‌ల సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుడమి మార్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● నవీన్ మృతిపై విచారణ చేయండి ● మార్ట్ ముందు మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా



కిసాన్ మార్ట్ ముందు మృతదేహంతో ఆందోళన చేస్తున్న నవీన్ కుటుంబసభ్యులు,

తంబళ్లపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ మృతికి కారకులైన పుడమి కిసాన్ మార్ట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడు నవీన్‌కుమార్ కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తంబళ్లపల్లె పుడమి కిసాన్ మార్ట్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్ (24) గురువారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. నవీన్ మృతదేహానికి శుక్రవారం జిల్లా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పుడమి మార్ట్ ముందు రోడ్డుపై మృతదేహంతో బైఠాయించారు. మార్ట్ మేనేజరు కృషమూర్తి అవకతవకలకు పాల్పడి, ఈ మోసాన్ని తమ బిడ్డపై మోపడం తోనే.. నింద పడలేక నవీన్ మృతి చెందాడన్నారు. సుమారు 40 గంటలు పైనా గడుస్తున్నా తప్పు చేసిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నేతలు మృతుడి కుటుంబ సభ్యులకు మద్దతు తెలిపారు. అనంతరం తంబళ్లపల్లె-మదనపల్లె రహదారిలోని మూడు రోడ్ల కూడలిలో రోడ్డుపైనే టెంటు వేసుకుని బైఠాయించారు. దీంతో మూడు రోడ్లు కూడలిలో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది.

ఆదుకుంటాం: టీడీపీ ఇన్‌చార్జి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ లోకేష్ రెడ్డితో కలసి, నవీన్ కుటుంబీకులతో మాట్లాడారు. సీఐ లక్ష్మన్నతో ఫోన్లో మాట్లాడి కేసు పురోగతిని ఆరాతీశారు. వెంటనే సమగ్ర విచారణ చేసి కేసు పరిష్కరించాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో శాంతించిన మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ధర్నాను విరమించారు. అనంతరం నాయకులతో కలసి నవీన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాలివీడు గ్రామ పంచాయతీకి రూ.43.90 లక్షల ఆదాయం

గాలివీడు, మార్చి21(ఆంధ్రజ్యోతి): వారాంతపు సంతలో సెస్సు వసూలు హక్కులకు శుక్రవారం నిర్వహించిన వేలం ద్వారా గాలివీడు గ్రామ పంచాయతీకి రూ.43.90 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. కూరగాయల సంత రూ.14.3 లక్షలకు కే.గంగాధర్‌నాయుడు, పశువుల సంత రూ.23.56 లక్షలకు కే. బాలప్పనాయుడు, బస్టాండు గేటు రూ.6.31 లక్షలకు కే. గంగాధర్‌నాయుడు దక్కించుకున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన వెంకట రమణ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై భార్య కుటుంబ సభ్యులు కొడవలితో దాడిచేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ జే వడ్డెపల్లెకు చెందిన పసుపుల వెంకటరమణ భార్య ఈశ్వరమ్మకు గతంలో ఆమె మేనమామతో వివాహమైంది. ఆయన ద్వారా ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తరువాత వెంకటరమణ ఈశ్వరమ్మను తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. తర్వాత చాలా కాలం వరకూ వేరే ప్రాంతానికి వెళ్లి జీవించారు. ఈ మధ్యనే వారు తమ స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె పిల్లలు తమ అమ్మను తమకు కాకుండా చేశాడన్న కక్షతో అవ్వతాతతో కలసి కొడవలితో దాడి చేసి గాయపరిచారు ఈ మేరకు గ్రావస్తులు 108 వాహనానికి ఫోన్‌చేసి క్షతగాత్రుడిని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు డాక్టర్లు తెలిపారు. ఏఎస్ఐ మస్తాన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులను విచారణ చేసిన అనంతరం గాయపరచిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

గంగజాతరలో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

● మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు



గంగజాతర కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు

పెద్దతిప్పసముద్రం మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగమ్మ జాతరలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు వెల్లడించారు. శుక్రవారం ఆయన పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో జాతర కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలతో శాంతిసమావేశం నిర్వహించారు. గంగజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తామని, అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతరలో జరిగే ఆనవాయితీ కార్యక్రమాలను ఎప్పటి లాగే చేసుకోవాలని, మతాలను రెచ్చగొట్టే కార్యక్రమాలను చేయరాదన్నారు. గంగజాతరలో డీజేలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. అవాంఛనీయ సంఘటనలు సంభవిస్తే కమిటీ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కమిటీ సభ్యులు బ్యాడ్జీలు ధరిస్తే ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు పోలీసులు గుర్తించేందుకు ఉపయోగపడుతుందన్నారు. జాతర ప్రారంభం నుంచి ముగిసే వరకు కమిటీ సభ్యులు పోలీసులకు టచ్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ములకలచెరువు సీఐ లక్ష్మన్న, మండల తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, స్థానిక ఎస్ఐ హరిహరప్రసాద్,తో పాటు స్థానిక గంగజాతర నిర్వహించే కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారుల ఈకేవైసీ పూర్తి చేయండి

● రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులోని సభ్యుల ఈకేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ ధనంజయులు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఎస్ డీటీ ఎన్.ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో రేషన్‌డీలర్లు, ఎండీయూలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు ఇదివరకే, డీలర్లు ఈకేవైసీ చేశారని, ఇంకా మిగిలిన కొందరికి కూడా ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రేషన్ షాపులవారీ లబ్ధిదారుల జాబితా ఇచ్చామని, వాటిని రేషన్ డీలర్లు, ఎండీయూలు సంయుక్తంగా 25వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈకేవైసీ చేసుకోని సభ్యులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, రేషన్ కూడా నిలిచిపోయే ప్రమాదముందన్నారు. రేషన్ పంపిణీ చేసే ఈ-పాస్‌మిషన్, జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్‌యాప్ లేదా సమీప సచివాలయంలో చేసుకోవచ్చన్నారు. రేషన్ సరుకులను కార్డుదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇందులో ఎక్కడైనా అక్రమాలు, పొరపాట్లు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని మదనపల్లె పట్టణం, రూరల్‌లో ఇంకా ఈకేవైసీ చేసుకోని 19వేల మంది సభ్యులు ఉన్నారని, వారందరికీ సకాలంలో ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇది ఉద్యోగం కాదని, సేవగా భావిస్తూ, ఇదే తరహాలో అక్రమాలు, చెడ్డపేరుకు అవకాశం లేకుండా పని చేయాలని తహసీల్దార్ కోరారు. అనంతరం సీఎస్‌డీటీ ఎన్.ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ డీలర్లకు దీర్ఘకాలంగా షాపునకు సంబంధించి రికార్డుల పరంగా ఏదైనా పనులు, ఇబ్బం ది ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ఇదే తరహాలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ జిల్లాలోనే మదనపల్లెను ప్రథమ స్థానంలో నిలపాలని సీఎస్‌డీటీ కోరారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు ఎస్.మౌలాలి, ఎస్.ఇమాంఖాసీం, సుధీర్‌బాబు, రామచార్లపల్లె కృష్ణమూర్తి, జె.మురళి, వై.అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోషణ వాటికలు..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకు, కూరగాయల పెంపకం
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య రక్షణ



అంగన్‌వాడీ కేంద్రంలో సాగులో ఉన్న తోట



పండించిన ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సీడీపీవో అరుణకుమారి(ఫైల్)

పోషకాలు తాజాగా...

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటోంది. వీరి ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రత్యేక కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలను పండించి అందజేయాలనే ఉద్దేశ్యంతో పోషణ వాటికలు ఏర్పాటు చేసింది. సాగుకు రూ.10వేల రూపాయల చొప్పున మంజూరు చేస్తోంది.

ప్రొద్దుటూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో మొత్తం 135 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో రెండు విడతలుగా 54 పోషణ వాటికలు ఏర్పాటు చేశారు. ఇందులో గోంగూర, మెంతి ఆకుకూరలు, ముల్లంగి, టమోట, మునగ, బొప్పాయి, దానిమ్మ, శీతాఫలం, అరటి, ఉసిరి వంటి మొక్కలు సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించే ఆకుకూరలు, కూరగాయలను అంగన్వాడీలోని చిన్నారులకే కాదు, వారి తల్లులకు, గర్భిణులకు తాజాగా ఆహారంగా పంపిణీ చేస్తున్నారు.

పోషణ వాటికలు కొనసాగిస్తున్నాం..

గ్రామీణ ప్రాంతాల్లో సొంత భవనాలు ఉన్న చోట పోషణ వాటికలను కొనసాగిస్తున్నాం. విత్తనాలు అంగన్‌వాడీ కార్యకర్తలే తెచ్చుకుని కూరగాయలు, ఆకుకూరలు ప్రకృతి పద్ధతిలో పండిస్తున్నారు. స్థలం కొరత ఉన్న ప్రాంతాల్లో డబ్బాలు, కుండీలల్లో మొక్కల పెంచే యోచన చేస్తున్నాం.

-అరుణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, ప్రొద్దుటూరు రూరల్

మూడు శాఖల సిబ్బంది అనుసంధానం..

ఈ పథకం అమలుకు మూడు శాఖలకు సంబంధించిన సిబ్బందిని ప్రభుత్వం అనుసంధానం చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది స్థల సేకరణ చేసిన అనంతరం ఉపాధి హామీ సిబ్బంది ఆధ్వర్యంలో భూమిని శుభ్రం చేసి మడులు ఏర్పాటు చేస్తారు. స్థలం కొద్దిగా ఉన్న ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలే ఈ పనిని పూర్తి చేస్తు న్నా రు. సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పర్యవేక్షణలో విత్తనాలు పెట్ట డం, అవసరమైన సేంద్రియ ఎరువులు, కషాయం తయారు చేసి అంగన్‌వాడీ సిబ్బందికి అందజేస్తున్నారు. దీంతో నాణ్యమైన పంట పండించి కేంద్రాలకు వచ్చే వారికి ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తారు.

నిత్యకృత్యంలా..

పోషణ వాటికల్లో అప్పుడప్పుడు కాకుండా ఎల్లప్పుడూ కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తుంది. దానికి అనుగుణంగానే ఒక పంట ముగిసాక వదిలేయకుండా మళ్లీ నేలలో మట్టిని తిరగబెట్టి విత్తనాలు చల్లుతున్నారు. ఆకుకూరలు సాగు చేసిన చోట అవిపూర్తి అయ్యాక మళ్లీ తోటకూర, పాలాకు, గోంగూర విత్తనాలు వేస్తున్నారు. హార్టీకల్చర్ వారు సరఫరా చేసిన 12 రకాల మొక్కలను పెంచుతున్నారు.

హజ్‌యాత్రకు బెజవాడలో ఎంబార్కేషన్ రద్దు

- 100 మంది లోపే దరఖాస్తు చేయడంతో నిర్ణయం
- రాష్ట్రం నుంచి ఎక్కువ సంఖ్యలోనే యాత్రికులు
- అత్యధికులు హైదరాబాద్ విమానాశ్రయానికి పయనం
- విజయవాడలో టికెట్, ప్యాకేజీ ధరల భారమే కారణం

విజయవాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): హజ్‌యాత్రకు విజయవాడ విమానాశ్రయంలో ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. చాలా తక్కువ సంఖ్యలో హజ్ యాత్రికులు విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించటానికి దరఖాస్తు చేసుకోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. రాష్ట్రం నుంచి గణనీయమైన స్థాయిలోనే హజ్ యాత్రికులు వెళుతున్నా.. విజయవాడ విమానాశ్రయాన్ని తక్కువగా ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఏపీకి చెందిన ఎక్కువ మంది హైదరాబాద్ విమానాశ్రయం నుంచే హజ్‌యాత్రకు వెళ్తున్నారని తెలుస్తోంది. విజయవాడ కంటే హైదరాబాద్ నుంచి విమాన టికెట్లు, ఇతర ప్యాకేజీల ధరలు చాలా తక్కువగా ఉండటమే దీనికి కారణం. విజయవాడ విమానాశ్రయంలో మొదటిసారిగా ఎంబార్కేషన్ పాయింట్ వచ్చినపుడు 1800 మంది హజ్‌యాత్రికులు ఈ విమానాశ్రయం నుంచి ప్రయాణించారు. ఆ తర్వాతి ఏడాది 900 మంది ప్రయాణించగా.. ప్రస్తుతం 100 మంది లోపు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఎంబార్కేషన్ పాయింట్ ఇవ్వాలంటే కనీసం 300 మంది ఇక్కడి నుంచి ప్రయాణించాల్సి ఉంటుందని సమాచారం. శంషాబాద్ విమానాశ్రయం కంటే విజయవాడ విమానాశ్రయం నుంచి విమాన టికెట్, ఇతర ప్యాకేజీ ధరలు ఎక్కువగా ఉండటం వల్లే హజ్ యాత్రికుల్లో అత్యధికులు శంషాబాద్‌కు చాయిస్ ఇచ్చినట్టు తెలుస్తోంది.

హజ్‌కు వెళ్లే సౌకర్యం రద్దు అన్యాయం

- ఇన్‌చార్జి కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు

కడప కలెక్టరేట్, మార్చి 21 (ఆం ధ్రజ్యోతి): విజయవాడ నుంచి హజ్‌యాత్రకు వెళ్లే హాజీలకు ఉన్న ఎంబర్కేషన్ పాయింట్ సౌకర్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయ డం అన్యాయమని, పాత విధానంలోనే కొనసాగించి ముస్లింల మనోభావాలను కాపాడాలని కాంగ్రెస్ నేతలు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్‌కు శుక్రవారం వినతి అం దించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది హజ్‌కు వెళ్లే యాత్రీకులు తక్కువగా ఉన్నారని, విమానయాన చార్జీలు ఎక్కువగా ఉన్నట్లు కారణాలు చూపి విజయవాడ నుంచి బయలుదేరే సౌకర్యాన్ని రద్దు చేయిం చడంలో ఎన్డీఏ, కూటమి సర్కారుల పాత్ర స్పష్టంగా ఉందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీల సిఫార్సు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తెలియజేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పు పట్టిందన్నారు. వెంటనే పునరుద్ధరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, మాజీ కార్పొరేటర్ రహ మతుల్లా ఖాన్, కమాల్‌బాష, హమీద్‌లు ఉన్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీ.. హెడ్‌కానిస్టేబుల్ మృతి



దువ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఏఆర్‌హెడ్‌కానిస్టేబుల్ బండి నారాయణ (50) మృతి చెందాడు. పోలీసుల వివ రాల మేరకు.. విధుల్లో భాగంగా బండి నారాయణ చెక్‌పోస్టు వద్ద ఉండగా హైదరాబాదు నుంచి కడప వైపు వెళుతున్న కావేరి ట్రావెల్స్ బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో చాగలమర్రిలోని కేరళ ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

మొక్కల పెంపకంతోనే అడవుల సంరక్షణ : డీఎఫ్‌ఓ



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క స్మగ్లర్లు మరో పక్క అగ్ని ప్రమాదాలతో అడవులు నానాటికి అంతరించి పోతున్నాయని... అడవులను తిరిగి సంరక్షించుకోవాలంటే ప్లాంటేషన్ ద్వారానే సాధ్యమవుతుందని జిల్లా అటవీశాఖ అధికారి వినిత్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తన చాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మొక్కల పెంపకం అంటే ఎక్కువమంది పండ్ల మొక్కల గురించి అడుగుతున్నారు తప్ప అటవీ మొక్కల గురించి ఏ ఒక్కరు అడగడం లేదన్నారు. ఇళ్ల వద్ద మనం పెంచుకునే పూల, పండ్ల మొక్కలు వల్ల పక్షులకు కూడా పెద్దగా ప్రయోజనం ఉండ దన్నా రు. ప్రైవేటు నర్సరీలలో అటవీ మొక్కలు లభించ వన్నారు. అందుకోసమే అడవులలో ఉండే పెద్ద పెద్ద వివిధ జాతులకు సంబంధించిన చెట్ల నుంచి విత్తనాలు సేకరించి అటవీశాఖ నర్సరీలలో మొక్కల పెంపకం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కాగా, కలెక్టర్ నేతృత్వంలో వివిధ శాఖల అధి కారుల సమన్వయంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కల పెంపకం చేపడుతామన్నారు. జూన్ జూలై మాసాల్లో ప్రజల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. పర్యావరణ సమ తుల్య త మొక్కల పెంపకం, వాటి ఆవశ్యకతపై ప్రజలకు ప్రధానంగా యువతకు అవగాహన కల్పించి మొక్కలు నాటే కార్యక్రమంలో వారిని భాగస్వా మ్యం చేయను న్నట్లు డీఎఫ్‌ఓ వివరిం చారు. మొక్కల పెంప కంలో నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేష న్స్ (ఎన్జీఓలు) భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరులోని ఎకో పార్కు వద్ద రూ.84 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి.. అందులోనే నగరవనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

జిల్లాలోని అవధూత కాశినాయన స్వామి ఆశ్రమంలో భవనాల తొలగింపునకు 2023 లోనే ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. తిరిగి అక్కడ భవనాలు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం స్థలం మంజూరు చేసిందని.. ఇందుకు సంబం ధించిన ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. వైసీపీ నేత సజ్జల రామ కృష్ణారెడ్డికి సంబంధించిన అటవీ భూముల ఆక్రమణకు సంబంధించి ఆయన స్పందిస్తూ ఆ భూముల సర్వేకి ఒక కమిటీని ఏర్పాటు చేశారని.. ఆ కమిటీ నివేదిక ఆధారంగానే స్పష్టత వస్తుందన్నారు. అలాగే కడప నేటివ్ ఫారెస్ట్ రెస్టోరేషన్ ప్రాజెక్టు పోస్టర్ ఆవిష్కరించారు. ప్రొద్దుటూరు, బద్వేలు సబ్ డీఎఫ్‌ఓలు దివాకర్, స్వామి వివే కానంద, బద్వేల్, కడప పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు ప్రసాద్, రఘునాథరెడ్డి, హేమాంజలి, తదితరులు పాల్గొన్నారు.

23న ప్రవేశ పరీక్ష

సీకేదిన్నె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహిస్తున్నట్లు పరీక్షల సమన్వయకర్త ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఈ పరీక్ష దరఖాస్తు చేయనివారు 23వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే 8 పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2గంటలకు నేరుగా హాజరై సర్టిఫికెట్లు,పాస్‌పోర్టుసైజు ఫొటో, రూ.500 నగదు చెల్లించి పరీక్ష రాయవచ్చన్నారు.

యువత ద్వారానే సమాజంలో మార్పు

- స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శంకర్



ప్రసంగిస్తున్న స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శంకర్

కడప మారుతీనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి వెన్నెముకగా భావించే యువత బలంగా వుండడం ద్వారా సమాజంలో మంచి మార్పు వస్తుందని స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పేరొన్నారు. వికసిత్ భారత్ నేషనల్ యూత్ ఫెస్టివల్-2025 కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వ యువజన క్రీడా వ్యవ హారాలశాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేం ద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ ఆధ్వర్యం లో శుక్రవారం స్థానిక కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో వికసిత్‌భారత్ జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై యువతీ, యువకులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందు లో ఉమ్మడి కడప జిల్లా నుంచి 142 మంది యువ తీ, యువకులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పసుపులేటి శంకర్ హాజరై మాట్లా డారు. భారతదేశంలోని యువత శక్తి సామర్థ్యా లను వెలికితీసేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పోటీ లు నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో యువత వారి ఆలోచన విధానాన్ని బయటి ప్రపంచానికి చెప్పేందుకు ఒక అవకాశంగా మలచుకోవాలన్నారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ మాటాడుతూ దేశాన్ని అభివృద్ధి బాటలో పయనింపచేసేది యువతే అన్నారు. దేశ పురోగతి సాధించాలంటే యువత వారి శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలన్నారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, వైవీయూ ఎన్ ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకట రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మయ్య, గంగాధర్, డాక్టర్ పార్వతి, వేణుగోపాల్, డాక్టర్ కె.అపర్ణ, రషీదా, రూప, సానియా తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 3 నుంచి కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో జరగనున్న 10వ తరగతి మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలని యూటీఎఫ్ ప్రతినిధులు డీఈవో షంషుద్దీన్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో ఆయను కలిసి వినతి పత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ప్రతినిధులు నరసింహరావు, రమణ, గోపినాథ్, వీరనారాయణ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల అభివృద్ధే ఏపీజీబీ లక్ష్యం

- జనరల్ మేనేజరు సంజీవప్ప



మాట్లాడుతున్న జనరల్ మేనేజరు ఆర్ఎం సంజీవప్ప

బ్రహ్మంగారిమఠం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని జనరల్ మేనేజరు సంజీవప్ప తెలిపారు. శుక్రవారం ఆయన బ్రహ్మంగారి మఠం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును పరిశీలించి.. సిబ్బందితో సమావేశమయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖాతాదారులకు ఇచ్చిన రుణాలు, బకాయిలు తదితర అంశాలపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో మొండి బకాయిలు ఉన్న రైతన్నలు, ఖాతాదారులకు వన్‌టైం సెటిల్‌మెంటు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలతో ప్రతి ఖాతాదారుడు వారి కుటుంబం అభి వృద్ధి చెందాలన్నదే బ్యాంకు లక్ష్యమన్నారు, బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి బ్యాంకు నుంచి రుణాలను పొందాలన్నారు. రాజంపేట డివిజన్ రీజనల్ మేనే జరు సుశాంత్‌కుమార్ ఏపీజీబీ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు బాలా దిత్య, అసిస్టెంటు మేనేజరు రాము, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సరికొత్త ఆవిష్కరణల దిశగా

విద్యార్థులు ముందుకు సాగాలి : వీసీ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలతో ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇన్ బయాలజీపై సైన్స్ అకాడెమీస్ లెక్చర్ వర్క్‌షాప్ ముగింపుసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం ద్వారా విప్లవాత్మకమైన మార్పునకు ప్రభుత్వం తెరతీసిందని.. ఇకపై విద్యార్థులు కష్టపడడం మీద దేశభవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ కలలు కన్న వికసత్ భారత్ సహకారం కావాలంటే విలువైన పరిశోధనలు రావాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రెండు రోజుల వర్క్‌షాప్‌లో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేలా అకాడమీల సైంటిస్టులు లెక్చర్స్ ఇచ్చారన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ రాజగోపాల్ ఆర్గనైజేషన్స్ అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రియాజున్నీసా, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాదక్క, మాధవరెడ్డి, దాక్షాయిని, టి.చంద్రశేఖర్, ఎ.చంద్రశేఖర్, మునికుమారి, తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

- బహిరంగ సభకు ప్రజలు కరువు
- ప్రజాప్రతినిధులు స్పందన అంతంత మాత్రమే



పులివెందులలో జరిగిన ప్రజావేదికకు హాజరైన పీడీ ఆదిశేషారెడ్డి

పులివెందుల రూరల్,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన సామాజిక తనిఖీ బహిరంగ సభకు అధికారులు వచ్చారు. విన్నారు... వెళ్లారు అన్న చందంగా మారింది. పులివెందుల మండలంలో 2023-24 సంవత్సరంలో చేపట్టిన వివిధ పనులకు గాను సామాజిక తనిఖీ బృందం చేపట్టిన తనిఖీల్లో కనుగొన్న విషయాలపై బహిరంగసభను స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం చేపట్టారు. కార్యక్రమం ఉదయం 10గంటలకు మొదలు కావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.45గంటలకు మొదలైంది. సాధారణంగా బహిరంగ సభ అంటే ప్రజలు హాజరై అవతవకలపై ఫిర్యాదులు చేస్తారు. కనీసం సర్పంచులు, ఎంపీటీసీలు అయినా హాజరై గ్రామంలో ఉపాధి ద్వారా జరిగిన అభివృద్ధిగాని, అవకతవకలకు సంబంధించి చర్చించాల్సి ఉండగా అది కూడా జరగలేదు. ఒకరిద్దరు ప్రజాప్రతి నిధులు హాజరైనా విగ్రహాల్లా కూర్చున్నారే తప్ప సమస్యలపై చర్చించలేదు. తనిఖీ బృందం తనిఖీల్లో కొన్ని అవకతవకలు బయ టపడగా పీడీ ఆదిశేషారెడ్డి దాదాపు రూ.31,169 వేలు జరిమానాలువిధించారు. దీనిని బట్టి గ్రామాలలో ఉపాధి ద్వారా చేపట్టిన పనుల్లో అవకతవకలు జరిగాయని బయటపడింది. ఇది ఎలా జరిగిందని తెలుసుకోవాలనే ఆసక్తి ప్రజాప్రతినిధులలో కనిపించలేదు. గ్రామ సభకు ప్రజలు, ప్రజల తరపున ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు కనిపించకుండా తొండూరు, లింగాల తదితర మండలాల ఉపాధి టీఏలు, ఈసీలు, సిబ్బందితో కవర్ చేశారు. మధ్యాహ్నం 12.45కి ప్రారంభమైన గ్రామ సభ 2గంటలకు ముగిసింది. ఈ కార్యక్రమంలో డీపీఓ, ఏపీడీ, ఎంపీపీ, ఎంపీడీఓ, ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది రోజున పురస్కారాలు



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రాజంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. రాయలసీమ కళాపీఠం విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సేవా రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన వారికి ఉగాది పండుగ రోజున విశిష్ట పురస్కారాలు అందిస్తోందన్నారు. ఉగాది రోజున రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం హాజరవుతారన్నారు.

కండక్టర్‌పై మహిళ ఫిర్యాదు

నందలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కడప నుంచి రాజంపేట వైపుకు వస్తున్న బస్సులో ఈనెల 16న రాత్రి రాజంపేట డిపోకు చెందిన కండక్టర్ రవికుమార్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని సయ్యద్ నూరిహుస్సేని పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఏఎస్‌ఐ సుబ్బరాయుడు తెలిపారు.

ఏవో బాధ్యతల స్వీకరణ

వీరబల్లి, మార్చి21(ఆంధ్రజ్యోతి): వీరబల్లి ఎంపీడీవో కార్యాలయం ఏవోగా ఎస్. బసిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వేంపల్లెలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

- 12 సంవత్సరాలుగా నిర్మాణంలోనే ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం
- ప్రతి రోజూ విద్యార్థులకు తప్పని ఐదు కిలోమీటర్ల కాలినడక
- పట్టించుకోని గిరిజన, బీసీ సంక్షేమ శాఖల అధికారులు



రాజుల కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ భవనం

రాయచోటి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):గిరిజన సంక్షేమశాఖ, బీసీ సంక్షేమశాఖ అధికారుల నిర్లక్ష్యం హాస్టల్ విద్యార్థులకు శాపంగా మారింది. 2013లో రూ.3.5 కోట్ల నిధులతో మంజూరైన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం గత 12 సంవత్సరాలుగా నిర్మాణం కొనసాగుతూనే ఉండడంతో హాస్టల్ విద్యార్థులకు ప్రతిరోజు ఐదు కిలోమీటర్ల కాలినడక తప్ప డం లేదు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని చెన్నముక్కపల్లె రాజులకాలనీలో గల బీసీ సంక్షేమ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో బీసీ సంక్షేమ శా ఖ అధికారులు అప్పటి ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి హాస్టల్ భవనాన్ని రాయచోటి పట్టణ పరిధిలోని సుండుపల్లె రోడ్డులో గల ఈదులవంక వద్ద ఉన్న ప్రభుత్వ సిరికల్చర్ భవనంలోకి మార్చారు. అయితే ఆ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులంతా చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. వీరంతా గత 12 సంవత్సరాలుగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 5 కిలోమీటర్ల మీటర్ల చొప్పున కాలినడకన రోడ్డు వెంబడి వచ్చి రింగు రోడ్డు దాటుకుని పాఠశాలకు వెళ్లాలి. ఆ దారిపై ప్రమాదవశాత్తూ ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనే యోచన లేకుండా ఖాళీ చేసిన బీసీ వసతి గృహ స్థానంలో నూతన గృహాన్ని నిర్మించకుండా వదిలేశారు. ఆ హాస్టల్ భవన స్థలాన్ని 2013లో అప్పటి ఉమ్మడి జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించారు. గిరిజన సంక్షేమశాఖ అధికారుల వినతి మేరకు అప్పటి ప్రభుత్వం ఆ బీసీ సంక్షేమ హాస్టల్ భవనం స్థానంలో ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించేందుకు రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులను పొందిన కాంట్రాక్టర్ ఒక ఫ్లోర్ స్లాబు వేసి, రెండో ఫ్లోర్ గోడలు కట్టి అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో 2014 సంవత్సరం తర్వాత ప్రభుత్వాలు మారడం, రాష్ట్రం విడిపోవడం నెలకొన్న తరుణంలో ఆ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణాన్ని గాలికి వదిలేశారు. దీనిపై అటు గిరిజన సంక్షేమశా ఖ అధికారులు గానీ, ఇటు బీసీ సంక్షేమ శాఖ అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులు గానీ, జిల్లా ఉన్నతాధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ఆ హాస్టల్ భవనం అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. కాగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు పథకం కింద కూడా ఆ హాస్టల్ భవనాన్ని చేర్చకపోవడంతో నేటికీ అలాగే పడి ఉంది.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు



అటు గిరిజన సంక్షేమశాఖ అధికారులు ఇటు బీసీ సంక్షేమశాఖ అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ భవనాన్ని అలాగే వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. రూ.3. 5 కోట్లు నిధులు ఉన్నా హాస్టల్ భవనాన్ని ఎందుకు నిర్మించలేకపోతున్నారో చెప్పాలి.

- తుమ్మల లవకుమార్, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి

బీసీ బాయ్స్ హాస్టల్‌ను గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించాం

గతంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ బాయ్స్ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థలాన్ని 2013లో గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించాం. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణానికి గిరిజన సంక్షేమశాఖ అధికారులు పనులు ప్రారంభించారు. నిర్మాణాలు ముందుకు సాగక పోవడంతో ఇటీవల రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ అధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని నిర్మాణాలను పూర్తి చేయాలని అందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నాం.

- సురేశ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా



చెన్నముక్కపల్లె హైస్కూల్ నుంచి కాలినడకన హాస్టల్‌కు వస్తున్న విద్యార్థులు

సీఎం సహాయ నిధి ఓ వరం

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి



చెక్కును అందిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారికి సీఎం సహాయనిధి ఓ వరమని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు.ఈ సందర్భంగా పార్లమెంట్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్య, వైద్యం అనేది ఖర్చుతో కూడుకున్న పని అన్నారు. సీఎం సహాయ నిధి కింద డేరంగుల అరుణ బాధిత కుటుంబానికి రూ.9,07,696 చెక్కును పంపిణీ చేసినట్లు తెలిపారు.

రైతులకు ఉపకరణాల పంపిణీ

ఓబులవారిపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సబ్‌ప్లాన్ పథకం అమలులో భాగంగా శుక్రవారం మండలంలోని గాదెల దళితవాడ రైతులకు ఉపకరణాలు పంపిణీ చేసినట్లు తెగుళ్ల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జోష్న, ఏవో మల్లిక తెలిపారు. మాస్కులు, కళ్లద్దలాలు, చేతికి బ్లౌజులు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎంసీఏ బుల్లయ్య, వీహెచ్ఏ వెంకటేశ్, ఐసీఆర్పీలు గంగాధర్, రెడ్డమ్మ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

'ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలి'

రాయచోటిటౌన్, మార్చి21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి ఉపాధి కూలీకి ఏడాదికి రూ.12 వేలు, ప్రతి పేదవాడికి ఒక హెక్టార్ భూమి పంపిణీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా సమితి సమావేశంలో మాట్లాడారు.

దంతాల శుభ్రత ఎంతో అవసరం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం దంతాలను శుభ్రం చేసుకోవాలని కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం మంజూరు

గాలివీడు, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రం మంజూరైనట్లు ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. శుక్రవారం గాలివీడు-2 సచివాలయాన్ని ఆయనన పరిశీలించారు. అర్హులైన మహిళలు ఈ నెల 22 లోపు రేషన్, ఆధార్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు.

టెక్‌ఫెస్ట్ కరపత్రం ఆవిష్కరణ

రాజంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య యూనివర్శిటీ 2025 టెక్‌ఫెస్ట్ కరపత్రాన్ని వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబా రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ 2025 సంవత్సరం ఏప్రిల్ 9, 10 తేదీల్లో టెక్‌ఫెస్ట్ ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టెక్‌ఫెస్ట్ విద్యార్థుల సాంకేతిక విజ్ఞానాన్ని, నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించే విధంగా ఉంటుదన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు, టెక్‌ఫెస్ట్‌లో ఉంటాయన్నారు. ఎం.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



ముకుందర (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21(ఆంధ్ర జ్యోతి): లక్కిరెడ్డిపల్లె పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ముకుందర (34) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ముకుందర కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. నేడు తమ సొంత గ్రామం వీరబల్లి మండలం వంగిమల్లలో ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారని తెలిపారు.

నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్,మార్చి21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలుస్తోందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తోందన్నారు. అన్నమయ్య జిల్లాలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాకు హాజరైన వారికి భోజన వసతి కల్పించారు.

వినియోగదారుల కోసమే ప్రత్యేక విద్యుత్ అదాలత్

రాయచోటిటౌన్, మార్చి21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్ నిర్వహించినట్లు విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస్ అంజనేయమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస్ ఆంజనేయమూర్తి, రిటైర్డ్ జడ్జి, ఆర్థిక సభ్యులు రాంమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మిల ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు.

మన సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలి: ఎస్ఐ



బదిలీపై వెళ్తున్న పోలీసులను సన్మానిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

గాలివీడు, మార్చి21(ఆంధ్రజ్యోతి): మన సేవలను ప్రజలకు గుర్తిండిపోయేలా పని చేయాలని ఎస్ఐ రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం బదిలీపై వెళుతున్న ఏఎస్ఐ వీవీ రమణ, కానిస్టేబుళ్లు నాగేంద్ర, పురుషోత్తం, రామాంజులు, రమేశ్‌బాబు, మదన్‌మోహన్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బదిలీపై ఎక్కడికి వెళ్లినా డిపార్టుమెంట్‌కు మంచిపేరు తీసుకురావాలన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ సామగ్రి వితరణ



కంప్యూటర్ సామగ్రి అందిస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.పి.ఆర్.కండ్రిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, జిరాక్స్ సెట్‌ను ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. శుక్రవారం విద్యార్థులు డి.శ్రీకాంత్, సి.నవీన్ కుమార్, సి.మోహన్ కిషోర్, సి.శ్రీనివాసులు, సి.వెంకటరామరాజు, కె. చరణ్ రాజు, కె.జగపతిరాజు, ఆర్. జయప్రకాష్ రాజు పాఠశాల విద్యాభివృద్ధికి తమవంతు సహకారంతో రూ.55 వేలు వెచ్చించి పాఠశాలకు కంప్యూటర్ సామగ్రి అందజేసినట్లు తెలిపారు.

ఒంటిమిట్టను టూరిజం హబ్‌గా ప్రకటించడం శుభపరిణామం: అతికారి

సిద్దవటం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : టెంపుల్ టూరిజం కింద ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటించడం హర్షణీయమని జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. శుక్రవారం సిద్దవటంలోని తన నివాసంలో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015లో రూ.34 కోట్లతో చంద్రబాబునాయుడు ఒక టీఎంసీ సామర్థ్యంతో ఒంటిమిట్ట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం చేపట్టారన్నారు. వైసీపీ హయాంలో ఒంటిమిట్ట చెరువు ఎత్తిపోతల పథకం మూలనపడిందన్నారు. శ్రీరామ ఎత్తిపోతల పథకం పంపు ప్రారంభం నుంచి కోటపాడు కనుమ వరకు పదేపదే పైపులైను నీటి ఒత్తిడి కారణంగా పగిలిపోతున్నందున 11 కోట్ల రూపాయలతో మూడు కిలోమీటర్ల మేర ఇనుప పైపులైను నిర్మాణం చేపడితే ఒంటిమిట్ట చెరువుకు రెండు నెలల్లో నీరు నింపవచ్చునన్నారు.

దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

రైల్వేకోడూరు రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబనపల్లె పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో సర్వే నెం 130, 116, 137లో దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రైతులకు న్యాయం చేయకుంటే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓ.కొత్తపల్లి బాధితులు తదితరులు పాల్గొన్నారు.

30, 31తేదీల్లో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

నందలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : షంషేర్ షటిల్ గ్రూపు ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీల్లో అన్నమయ్య, కడప జిల్లాస్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ నాన్‌మోడలిస్ట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ సునీల్ తెలిపారు. నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో టోర్నమెంట్ నిర్వహిస్తారన్నారు. ఈనెల 29 లోపుల తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పచ్చా హనుమంతనాయుడు



హనుమంతునాయుడిని అభినందిస్తున్న న్యాయవాదులు

రాజంపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది పచ్చా హనుమంతనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పి.సురేష్‌కుమార్, సహాయ ఎన్నికల అధికారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమంతనాయుడు మాట్లాడుతూ తన ఎంపికలో కీకలక పాత్ర పోషించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, నాసరుద్దీన్, రామచంద్రయ్య, రామచంద్రరాజు, రెడ్డయ్య పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు పోటాపోటీగా నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, ఆయన ప్యానల్ సభ్యులు

రాయచోటిటౌన్, మార్చి21(ఆంధ్రజ్యోతి): రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 29న జరగనుండగా అభ్యర్థులు పోటా పోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయడానికి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన ప్యానెల్‌లోనే ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న పీ.రెడ్డి బాషా, స్పోర్ట్స్ ఆర్యదర్శిగా పనిచేస్తున్న వీ. సిద్దయ్య కూడా నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్.ప్రభాకర్‌రెడ్డికి పోటీగా మరో ప్యానెల్ నుంచి వై.రమేశ్‌రెడ్డి అధ్యక్షుడిగానూ, ప్రధాన కార్యదర్శిగా పీ.శ్రీనివాసులు నామినేసన్ వేసిన విషయం విదితమే.

ఎనిమిది మంది పోలీసులు బదిలీ

సుండుపల్లె, మార్చి21(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పోలీస్‌స్టేషన్ నుంచి 8 మంది పోలీసులు బదిలీ అయినట్లు శుక్రవారం పోలీసు అధికారులు తెలిపారు. ఏఎస్ఐలు కేజీవీ రమణ, బ్రహ్మం, సుబ్బన్న, హెడ్‌కానిస్టేబుల్ బీడీ నాయక్, పీసీలు ప్రవీణ్‌కుమార్, శేషాద్రి, రమేశ్, మోహన్‌లు బదిలీ అయినట్లు తెలిపారు. కాగా పోలీస్‌స్టేషన్‌కు 9 మంది కొత్త వారు రావాల్సి ఉందన్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

- ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జే.ఏ చౌదరి

కురబలకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలను స్థాపించి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించాలని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జే.ఏ చౌదరి, కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించే జాతీయ ఐపీ యాత్రను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ విలువ అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకుంటూ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి టెక్నాలజీకి కమ్యూనికేషన్ చాలా అవసరమన్నారు. కనెక్ట్ కొలాబిరేషన్, మెంటరింగ్, మార్కెటింగ్ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. అందుకు కావాల్సిన అన్ని వసతులను కళాశాల కల్పిస్తుందన్నారు. మేధో సంపత్తి భవిష్యత్‌ను ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. వర్క్‌షాప్‌లో భౌగోళిక సూచికలు, ట్రేడ్ మార్క్‌లు, కాపీరైట్స్, పేటెంట్ సహా మేధో సంపత్తి హక్కుల కీలక అంశాలను నిపుణులు తెలియజేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు వికసిత్ భారత్ ఆశయాలను స్థాపించవచ్చని, దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం న్యూ ఏఐ వెంచర్ స్టుడియో స్థాపనకు కళాశాలతో ఒప్పందం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి ప్రెసిడెంట్ ఎన్.ద్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఎల్.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జే.ఏ చౌదరి

కలెక్టరేట్‌లో పోలీసుల మాక్ డ్రిల్



కలెక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి21(ఆంధ్రజ్యోతి): బాంబు బెదిరింపు వస్తే ఎలా స్పందించాలనే అంశంపై శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. హుటాహుటిన జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న పోలీసులు, ఉద్యోగులను బయటకు పంపి కార్యాలయంలో అణువణువు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ చలపతి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు ఎలా వ్యవహరించాలన్న అంశంపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు సహాయపడతాయన్నారు. అనంతరం బాంబు బెదిరింపు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎక్కడైనా ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసులకు ప్రజలు సహరించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వీజే రామకృష్ణ, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

బి.కొత్తకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లె పంచాయతీ పరిధిలోని కనికలతోపు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి(60) మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం అతని కాళ్లమీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడి వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న బి.కొత్తకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్ బాబు తెలిపారు.

కృష్ణ జింకకు గడ్డుకాలం!

కృష్ణ జింకలకు గడ్డుకాలం దాపురించింది. అడవుల్లో మేత...నీటి లభ్యత లేకపోవడం వాటి మనుగడకు శాపంగా మారుతోంది. రోడ్డు ప్రమాదాలు, కుక్కల బారిన పడి ఏటా వంద దాకా ప్రాణాలు కోల్పోతున్నాయి. రాష్ట్ర అధికారిక జంతువైన కృష్ణ జింకల సంఖ్య ఈ ప్రాంతంలో విపరీతంగా పెరుగుతున్నా తగిన వసతులు కల్పించడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. అడవుల్లో ఉన్న జల వనరులు అడుగంటి పోతుండగా.. దుస్థితికి చేరిన తొట్టెలలో నీరు నిలవడం లేదు. మేత కూడా కరువైంది. ఫలితంగా జింకలు మేత, నీరు వెతుక్కుంటూ వస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి.. ప్రస్తుతం వేసవి ముంచుకొస్తుండడంతో అడవుల్లో నీరు దొరక్క జింకలు దాహంతో అలమటించి మృత్యువాత పడే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.



సండ్ర అడవిలో ఎండిపోయిన పాపన్న కుంట





రోడ్డు ప్రమాదం, కుక్కలబారిన పడి మృతి చెందిన జింకలు (ఫైల్‌ఫోటోలు)

- మేత, నీటి కోసం జనారణ్యాలకు..
- రోడ్డు ప్రమాదాలు.. కుక్కల బారిన పడి మృతి
- అడవుల్లో అడుగంటిన జలవనరులు..
- దుస్థితిలో సాసర్‌పిట్‌లు, బోర్లు
- వేసవిలో జటిలం కానున్న నీటి సమస్య..

ములకలచెరువు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజవర్గంలోని ములకల చెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె మండలాల్లో జింకలు మందలు మందలుగా సంచరిస్తూ ఉంటాయి. ప్రస్తుతం వీటి సంఖ్య సుమారు 30 నుంచి .40వేల వరకు ఉండవచ్చని అటవీశాఖ అధికారుల అంచనా.. ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద తిప్పసముద్రం మండలాల్లో సండ్రడివి, కను గొండ, నల్గొండ, మొతుకుమల రిజర్వు ఫారె స్టు 3,204 హెక్టార్లలో విస్తరించి ఉంది. ఈ రిజర్వు ఫారెస్టులో జింకల సంచారం అత్యధికంగా ఉంది. కొన్నేళ్ళుగా నిర్వహణ లేకపోవడంతో అటవీ ప్రాంతంలోని కుంటలు, చెలమలు పూడిపోయి వాటిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, ఎండల తీవ్రత కారణంగా ప్రతి ఏటా ఆడవుల్లోని నీటి వనరులు వట్టిపోతున్నాయి. దీనికి తోడు మేత దొరడం కష్టంగా మారింది. దీంతో జింకలు ఆడవులను వదిలి పొలాల వద్దకు పొలాల వద్దకు వస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై, కుక్కల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ములకలచెరువు మండల పరిధిలోని అటవీప్రాంతం సమీపంలో 20 కిలో మీటర్లకు పైగా ముంబాయి - చెన్నై జాతీయ రహదారి ఉంది. పెద్దతిప్పసముద్రం మండలంలో 30 కిలో మీటర్లు, బి.కొత్తకోటలో 15 కిలో మీటర్లు, తంబళ్ళపల్లె మండలంలో 15 కిలోమీటర్లుదాకా అటవీ ప్రాంతానికి ఆనుకుని రోడ్లు ఉన్నాయి. మేత, నీటి కోసం వచ్చిన వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో వాహనాల కింద పడి ఏటా 60 నుంచి వంద వరకు ప్రాణాలు వదులుతున్నాయి. గ్రామ పరిసరాల్లోకి వస్తే కుక్కలు దాడి చేసి చంపేస్తున్నాయి. పొలాల్లో మోతాదుకు మించి వాడుతున్న క్రిమిసంహారక మందులు కూడా జింకల ప్రాణాలు తీస్తున్నా యి. .



సండ్రఅడవిలో నిరుపయోగంగా మారిన చేతి పంపు, సాసర్‌పిట్

నీటి తొట్టెలున్నా..

సండ్రడివి రిజర్వు ఫారెస్టులో వన్యప్రాణులు, జింకలకు తాగునీటి వసతి కల్పించేందుకు అటవీశాఖ 12 నీటి తొట్టెలు ఏర్పాటు చేసింది. ఈ తొట్టెలన్నీ దెబ్బతినడంతో, నీరు నిలువ ఉండడం లేదు. అడవిలోని చేతి పంపు చెడిపోయి ఏళ్ళు గడుస్తున్నా మరమ్మతులు చేయించలేదు. పాపన్న కుంట పూడికతో నిండి పోయింది. కనుగొండ, నల్గొండ, మొతుకుమల అడవుల్లో ఉన్న నీటి వనరులు కూడా వట్టిపోతున్నాయి.

ముందు చూపు లేకే..

జింకల సంరక్షణలో అటవీశాఖ ఉన్నతాధికా రుల చొరవ కరువైంది. ప్రధానంగా ములకల చెరువు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, పెద్ద తిప్పసముద్రం మండలం కందకూరు సమీపంలో జింకలు తిరిగే ప్రాంతమని.. వాహనాలు నెమ్మదిగా వెళ్ళాలని సూచిస్తూ పదేళ్ల క్రితం బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్డులపై అక్షరాలు కనిపించడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి జింకలు సంచరించే ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా నీటిని నింపాలి. వర్షాకాలంలో మేత బీళ్లలో విత్తనాలు చల్లించాల్సి ఉంది. లేదంటే భవిష్యత్తులో వీటి సంఖ్య తగ్గిపోయే ప్రమాదం లేకపోలేదు.

తొట్టెల్లో నీరు నిలవడం లేదు



సండ్రడివిలో అటవీశాఖ ఏర్పాటు చేసిన తొట్టెల్లో నీరు నిలవడం లేదు. వర్షం కురిసినా, ట్యాంకర్లతో నీరు పట్టినా గంటల వ్యవధిలో ఇమిరిపోతున్నాయి. ప్రస్తుతం ఉన్న నీటి తొట్టెలకు మరమ్మతు లతో పాటు, మరిన్ని నిర్మిస్తే బాగుంటుంది.

- ఆంజనేయులు, దారంవాండ్లపల్లె, గొర్రెల కాపరి

నీటి కొరత లేకుండా చూస్తున్నాం



వేసవిలో కొరత లేకుండా నీటి వసతి కల్పిస్తాం. ప్రస్తుతం కూడా సాసర్ పిట్స్‌లో నీరు నింపుతున్నాం. ఎక్కడైనా తొట్టెలు మరమ్మతులకు గురైవుంటే తక్షణం బాగు చేయాలని ఆదేశించాం. అడవులు, కొండలకు నిప్పు పెడితే చర్యలు తప్పవు.

-జయప్రసాదరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మదనపల్లె



ములకలచెరువు సమీపంలో ఏర్పాటు చేసిన బోర్డుపై చెరిగిపోయిన అక్షరాలు

27నుంచి దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

కలికిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుంటూ రు వ్యవసాయ వర్సిటీ లాం ప్రాంగణంలో ఈ నెల 27 నుంచి 29 వరకూ దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఆచార్య ఎన్జీ రంగా, కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శనలో ఏపీ, తెలంగాణా, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, కర్ణాటక మరియు లక్షద్వీప్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రైతులు, రైతు సహకార సంఘాలు, ఎన్జీవోలు పాల్గొననున్నారు. ప్రదర్శనలకు సంబంధించి 200 పైగా విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో నూతన వంగడాల ప్రదర్శన, నూతన సాంకేతిక పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, వ్యవసాయ యాంత్రీ కరణ, ఉద్యాన, పాడి, మత్స్య రంగాల్లో నూతన సాంకేతికతల ఆవిష్కరణలుంటాయి. ఆసక్తి ఉన్న అన్నమయ్య జిల్లాలోని రైతులు పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తున్నారు. కేవీకే సమన్వయంతో ఈ ప్రదర్శనకు రైతులు హాజరు కావచ్చు. ఈ లోగా 8008500320నంబరును సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవడంతోపాటు వివరాలను కూడా తెలుసుకోవచ్చు.

ఉపాధి ఏపీవోల బదిలీ

మదనపల్లె టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఉపాధి హామీ పథకంలో ఏపీవోలుగా పనిచేస్తున్న పలువురి ని ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు తెలిసింది. దీర్ఘకాలంగా ఒకే మండలంలో పనిచేస్తున్న ఏపీవోలకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. వీరిలో మదనపల్లె ఏపీవో సుబ్రమణ్యంను కురబలకోటకు, కురబలకోట ఏపీవో వెంకటేశ్వరను బి.కొత్తకోటకు, బి.కొత్తకోట ఏ పీవో మంజులను కలికిరికి, పెద్దమండ్యం ఏపీవో మురళీమోహన్‌ను చిన్నమండ్యంకు, కలికిరి ఏపీవో ను జాతను కలకడకు, కలకడ ఏపీవో చెన్నకేశవులను మదనపల్లె మండలానికి బదిలీ చేశారు. వీరబల్లి మండలం ఏపీవో నాగరాజను చిట్వేలికి, చిట్వేలి మండలం ఏపీవో చంద్రకళను వీరబల్లికి, రామాపురం మండలం ఏపీవో సురేంద్రరెడ్డిని పెద్దమండ్యం కు బదిలీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. శనివారం జిల్లా వ్యాప్తంగా ఫారంపాండ్ల గ్రౌండింగ్ పనులు ప్రారంభం కానున్న క్రమంలో ఈ బదిలీ ఉత్తర్వులను తాత్కాలికంగా ప్రకటించలేదని సమాచారం. మరో రెండు రోజుల్లో ఈ బదిలీల ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉంది.

సోమవరం గ్రామ సర్వేయర్‌పై సస్పెన్షన్ వేటు

వీరబల్లి, మార్చి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామ సర్వేయర్ రాఘవేంద్రపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈయన విధుల పట్ల అలసత్వం వహించడంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేకు హాజరు కాకపోవడంలేదని అధికారులు కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సస్పెన్షన్ చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులు శుక్రవారం వీరబల్లి తమ కార్యాలయానికి అందినట్లు తహసీల్దార్ వెంకటేశు తెలిపారు.

ఐపీ పెట్టినా వేధింపులు ఆగలేదు


- రుణదాతలకు వినూత్న రీతిలో బాధితుడి వినతి



వడ్డీ వ్యాపారులకు విజ్ఞప్తి చేస్తూ పెట్టిన బ్యానర్

రైల్వేకోడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ భరించ లేక ఐపీ పెట్టినా వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు ఆగలేదని శుక్రవారం రైల్వే కోడూరు పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ సినిమా హాలు సమీపంలో ఉన్న ఓల్డ్ ఐరన్ మార్ట్ యజమాని మోహన్‌రాజు వినూత్న ఆందోళన చేశారు. మోహన్‌రాజు కథనం మేరకు.. ఐపీ పెట్టినా వడ్డీ వ్యాపారులకు అధిక వడ్డీలు చెల్లించినా వారు తీవ్రంగా వేధిస్తున్నారని, గతంలో చాలా మంది వడ్డీ వ్యాపారులకు సక్రమంగా డబ్బులు చెల్లించినా తనను విడిచి పెట్టకుండా వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తన దుకాణం వద్ద బ్యానర్ పెట్టి వడ్డీ వ్యాపారులకు ఇంక అసలు, వడ్డీ డబ్బులు చెల్లించలేనని, తన ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేదని, మానసికంగా ఆందోళన చెందుతున్నట్లు బ్యానర్‌లో పేర్కొన్నాడు. వడ్డీ వ్యాపారులు తనను ఇంకా వేధిస్తే ఆత్మహత్య తప్ప వేరే మార్గం కనిపించలేదని అప్పులు ఇచ్చిన వారికి విజ్ఞప్తి చేశాడు. పోలీసులు దీనిపై స్పందించి వడ్డీ వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ఆకతాయి చర్యకు మర్రి వృక్షం దగ్ధం



దగ్ధమవుతున్న మర్రిచెట్టు

గుర్రంకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు నిప్పంటించడంతో దశాబ్దాల నాటి భారీ మర్రి వృక్షం అగ్నికి ఆహుతైంది. స్థాని కులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని మర్రిమాకుల పల్లెకు పశ్చిమాన కోట ఉంది. ఈ కోటలో పురాతనమైన భారీ వృక్షాలున్నాయి. ఇలాంటి వాటిలో ఓ మర్రివృక్షం తొర్రలో ఓ వ్యక్తి చెత్తవేసి నిప్పంటించాడు. ఈ నిప్పు రవ్వలు అంటుకొని మొద్దు మొత్తం కాలిపోవడంతో భారీ వృక్షం బూడిదగా మారింది. వినాయక చవితి, సంక్రాంతి పండుగ ల రోజున గ్రామస్థులు ఈ వృక్షం వద్ద పూజలు చేసేవారని ప్రజ లు చెబుతున్నారు. ఈ విష యం అధికారులకు తెలిపినా పట్టిం చుకోలేదని రైతులు, ప్రజ లు వాపోతున్నారు.

ఆటో బోల్తా.. 8 మందికి గాయాలు

కలికిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళుతున్న ఒక ఆటో బోల్తా పడటంతో 8 మంది గాయపడ్డారు. కలికిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోళ్ళతోపు వడ్డెపల్లెకు చెందిన మహిళా కూలీలు శుక్రవారం ఉదయం కేవీ పల్లె మండలంలోని తిమ్మాపురానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యంలో కుక్కలు అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో గాయపడిన వారికి స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేశారు. తీవ్రంగా గాయపడిన గంగులమ్మ, వెంకటలక్ష్మి, సరస్వతి, లోకేశ్‌ను మెరుగైన వైద్యం కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిలో ఈశ్వరమ్మ, మంగమ్మ, గంగాదేవి, లక్ష్మీదేవి ఉన్నారు. కలికిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ షాపులపై దాడులు

రాజంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు మెడికల్ షాపులపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాములు ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. జాతీయ స్థాయిలో నిషేదించిన మందులను అమ్ముతున్నారా అనే అంశాన్ని అన్ని షాపుల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. సుమారు పదికి పైబడి షాపుల్లో ఉన్న మందులన్నింటిని క్షుణ్ణంగా ఆరా తీశారు. అందుకు సంబంధించిన బిల్లులను కూడా పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్త తనిఖీ ల్లో భాగంగా ఈ దాడులు నిర్వహించారు.

టిప్పర్, కంటైనర్ లారీ ఢీ

- టిప్పర్ డ్రైవర్ మృతి
- కంటైనర్ లారీ డ్రైవర్ పరిస్థితి విషమం





కంటైనర్ లారీని ఢీకొన్న టిప్పర్, (ఇన్‌సర్ట్) శివ మృతదేహం

పుల్లంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కంటైనర్ లారీ, టిప్పరు ఢీకొన్న ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ మృతి చెందగా కంటైనర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. రాజంపేట మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన చీమకుర్తి శివ(35) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. శుక్రవారం మంగంపేట నుంచి రాజంపేటకు టిప్పర్‌లో వెళుతూ ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే యత్నంలో మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో గుజరాత్ నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ లారీని బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందగా కంటైనర్ డ్రైవర్ పాండు తీవ్రంగా గాయపడ్డారు. ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే, రూరల్ సీఐ రమణ, పుల్లంపేట ఏఎస్ఐ పిచ్చయ్య తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ కంటైనర్ డ్రైవర్‌ను రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.
ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. టిప్పర్‌లో ఇరుక్కుపోయిన శివ మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీసి రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా రెండు భారీ వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో దాదాపు 3 గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఏఎస్పీ, సీఐలు, ఏఎస్ఐలు ఎక్స్‌కవేటర్‌ల సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుడమి మార్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- నవీన్ మృతిపై విచారణ చేయండి
- మార్ట్ ముందు మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా



కిసాన్ మార్ట్ ముందు మృతదేహంతో ఆందోళన చేస్తున్న నవీన్ కుటుంబసభ్యులు,

తంబళ్లపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ మృతికి కారకులైన పుడమి కిసాన్ మార్ట్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడు నవీన్‌కుమార్ కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తంబళ్లపల్లె పుడమి కిసాన్ మార్ట్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్ (24) గురువారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. నవీన్ మృతదేహానికి శుక్రవారం జిల్లా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పుడమి మార్ట్ ముందు రోడ్డుపై మృతదేహంతో బైఠాయించారు. మార్ట్ మేనేజరు కృష్ణమూర్తి అవకతవకలకు పాల్పడి, ఈ మోసాన్ని తమ బిడ్డపై మోపడంతోనే.. నింద పడలేక నవీన్ మృతి చెందాడన్నారు. సుమారు 40 గంటలు పైనా గడుస్తున్నా తప్పు చేసిన వారిని ఎందుకు అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నేతలు మృతుడి కుటుంబ సభ్యులకు మద్దతు తెలిపారు. అనంతరం తంబళ్లపల్లె-మదనపల్లె రహదారిలోని మూడు రోడ్ల కూడలిలో రోడ్డుపైనే టెంటు వేసుకుని బైఠాయించారు. దీంతో మూడు రోడ్లు కూడలిలో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది.

ఆదుకుంటాం: టీడీపీ ఇన్‌చార్జి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ లోకేష్ రెడ్డితో కలసి, నవీన్ కుటుంబీకులతో మాట్లాడారు. సీఐ లక్ష్మన్నతో ఫోన్లో మాట్లాడి కేసు పురోగతిని ఆరాతీశారు. వెంటనే సమగ్ర విచారణ చేసి కేసు పరిష్కరించాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో శాంతించిన మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ధర్నాను విరమించారు. అనంతరం నాయకులతో కలసి నవీన్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాలివీడు గ్రామ పంచాయతీకి రూ.43.90 లక్షల ఆదాయం

గాలివీడు, మార్చి21(ఆంధ్రజ్యోతి): వారాంతపు సంతలో సెస్సు వసూలు హక్కులకు శుక్రవారం నిర్వహించిన వేలం ద్వారా గాలివీడు గ్రామ పంచాయతీకి రూ.43.90 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులునాయక్, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ తెలిపారు. కూరగాయల సంత రూ.14.3 లక్షలకు కే.గంగాధర్‌నాయుడు, పశువుల సంత రూ.23.56 లక్షలకు కే. బాలప్పనాయుడు, బస్టాండు గేటు రూ.6.31 లక్షలకు కే. గంగాధర్‌నాయుడు దక్కించుకున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తిపై దాడి



దాడిలో గాయపడిన వెంకట రమణ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై భార్య కుటుంబ సభ్యులు కొడవలితో దాడిచేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ జే వడ్డెపల్లెకు చెందిన పసుపుల వెంకటరమణ భార్య ఈశ్వరమ్మకు గతంలో ఆమె మేనమామతో వివాహమైంది. ఆయన ద్వారా ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తరువాత వెంకటరమణ ఈశ్వరమ్మను తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. తర్వాత చాలా కాలం వరకూ వేరే ప్రాంతానికి వెళ్లి జీవించారు. ఈ మధ్యనే వారు తమ స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆమె పిల్లలు తమ అమ్మను తమకు కాకుండా చేశాడన్న కక్షతో అవ్వతాతతో కలసి కొడవలితో దాడి చేసి గాయపరిచారు ఈ మేరకు గ్రావస్తులు 108 వాహనానికి ఫోన్‌చేసి క్షతగాత్రుడిని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించినట్లు డాక్టర్లు తెలిపారు. ఏఎస్ఐ మస్తాన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులను విచారణ చేసిన అనంతరం గాయపరచిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

రేషన్ కార్డుదారుల ఈకేవైసీ పూర్తి చేయండి

- రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులోని సభ్యుల ఈకేవైసీపీ పూర్తి చేయాలని తహసీల్దార్ ధనంజయులు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఎస్ డీటీ ఎన్.ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో రేషన్‌డీలర్లు, ఎండీయూలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదారులకు ఇదివరకే, డీలర్లు ఈకేవైసీ చేశారని, ఇంకా మిగిలిన కొందరికి కూడా ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రేషన్ షాపులవారీ లబ్ధిదారుల జాబితా ఇచ్చామని, వాటిని రేషన్ డీలర్లు, ఎండీయూలు సంయుక్తంగా 25వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈకేవైసీ చేసుకోని సభ్యులకు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, రేషన్ కూడా నిలిచిపోయే ప్రమాదముందన్నారు. రేషన్ పంపిణీ చేసే ఈ-పాస్‌మిషన్, జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్‌యాప్ లేదా సమీప సచివాలయంలో చేసుకోవచ్చన్నారు. రేషన్ సరుకులను కార్డుదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇందులో ఎక్కడైనా అక్రమాలు, పొరపాట్లు జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని మదనపల్లె పట్టణం, రూరల్‌లో ఇంకా ఈకేవైసీ చేసుకోని 19వేల మంది సభ్యులు ఉన్నారని, వారందరికీ సకాలంలో ఆ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇది ఉద్యోగం కాదని, సేవగా భావిస్తూ, ఇదే తరహాలో అక్రమాలు, చెడ్డపేరుకు అవకాశం లేకుండా పని చేయాలని తహసీల్దార్ కోరారు. అనంతరం సీఎస్‌డీటీ ఎన్.ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ డీలర్లకు దీర్ఘకాలంగా షాపునకు సంబంధించి రికార్డుల పరంగా ఏదైనా పనులు, ఇబ్బం ది ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ఇదే తరహాలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తూ జిల్లాలోనే మదనపల్లెను ప్రథమ స్థానంలో నిలపాలని సీఎస్‌డీటీ కోరారు. సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు ఎస్.మౌలాలి, ఎస్.ఇమాంఖాసీం, సుధీర్‌బాబు, రామచార్లపల్లె కృష్ణమూర్తి, జె.మురళి, వై.అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

గంగజాతరలో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

- మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు



గంగజాతర కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలతో మాట్లాడుతున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు

పెద్దతిప్పసముద్రం మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న నడివీధి గంగమ్మ జాతరలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు వెల్లడించారు. శుక్రవారం ఆయన పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో జాతర కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలతో శాంతిసమావేశం నిర్వహించారు. గంగజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తామని, అసాంఘిక కార్యక్రమాలు, గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతరలో జరిగే ఆనవాయితీ కార్యక్రమాలను ఎప్పటి లాగే చేసుకోవాలని, మతాలను రెచ్చగొట్టే కార్యక్రమాలను చేయరాదన్నారు. గంగజాతరలో డీజేలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు నిర్వహిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. అవాంఛనీయ సంఘటనలు సంభవిస్తే కమిటీ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కమిటీ సభ్యులు బ్యాడ్జీలు ధరిస్తే ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు పోలీసులు గుర్తించేందుకు ఉపయోగపడుతుందన్నారు. జాతర ప్రారంభం నుంచి ముగిసే వరకు కమిటీ సభ్యులు పోలీసులకు టచ్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ములకలచెరువు సీఐ లక్ష్మన్న, మండల తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, స్థానిక ఎస్ఐ హరిహరప్రసాద్,తో పాటు స్థానిక గంగజాతర నిర్వహించే కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

పోషణ వాటికలు..



- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకు, కూరగాయల పెంపకం
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య రక్షణ

అంగన్‌వాడీ కేంద్రంలో సాగులో ఉన్న తోట



పండించిన ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సీడీపీవో అరుణకుమారి(ఫైల్)

పోషకాలు తాజాగా...

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటోంది. వీరి ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రత్యేక కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలను పండించి అందజేయాలనే ఉద్దేశ్యంతో పోషణ వాటికలు ఏర్పాటు చేసింది. సాగుకు రూ.10వేల రూపాయల చొప్పున మంజూరు చేస్తోంది.

ప్రొద్దుటూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లో మొత్తం 135 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో రెండు విడతలుగా 54 పోషణ వాటికలు ఏర్పాటు చేశారు. ఇందులో గోంగూర, మెంతి ఆకుకూరలు, ముల్లంగి, టమోట, మునగ, బొప్పాయి, దానిమ్మ, శీతాఫలం, అరటి, ఉసిరి వంటి మొక్కలు సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించే ఆకుకూరలు, కూరగాయలను అంగన్వాడీలోని చిన్నారులకే కాదు, వారి తల్లులకు, గర్భిణులకు తాజాగా ఆహారంగా పంపిణీ చేస్తున్నారు.

పోషణ వాటికలు కొనసాగిస్తున్నాం..

గ్రామీణ ప్రాంతాల్లో సొంత భవనాలు ఉన్న చోట పోషణ వాటికలను కొనసాగిస్తున్నాం. విత్తనాలు అంగన్‌వాడీ కార్యకర్తలే తెచ్చుకుని కూరగాయలు, ఆకుకూరలు ప్రకృతి పద్ధతిలో పండిస్తున్నారు. స్థలం కొరత ఉన్న ప్రాంతాల్లో డబ్బాలు, కుండీలల్లో మొక్కల పెంచే యోచన చేస్తున్నాం.

-అరుణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, ప్రొద్దుటూరు రూరల్

మూడు శాఖల సిబ్బంది అనుసంధానం..

ఈ పథకం అమలుకు మూడు శాఖలకు సంబంధించిన సిబ్బందిని ప్రభుత్వం అనుసంధానం చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది స్థల సేకరణ చేసిన అనంతరం ఉపాధి హామీ సిబ్బంది ఆధ్వర్యంలో భూమిని శుభ్రం చేసి మడులు ఏర్పాటు చేస్తారు. స్థలం కొద్దిగా ఉన్న ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలే ఈ పనిని పూర్తి చేస్తు న్నా రు. సేంద్రియ వ్యవసాయ సిబ్బంది పర్యవేక్షణలో విత్తనాలు పెట్ట డం, అవసరమైన సేంద్రియ ఎరువులు, కషాయం తయారు చేసి అంగన్‌వాడీ సిబ్బందికి అందజేస్తున్నారు. దీంతో నాణ్యమైన పంట పండించి కేంద్రాలకు వచ్చే వారికి ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తారు.

నిత్యకృత్యంలా..

పోషణ వాటికల్లో అప్పుడప్పుడు కాకుండా ఎల్లప్పుడూ కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తుంది. దానికి అనుగుణంగానే ఒక పంట ముగిసాక వదిలేయకుండా మళ్లీ నేలలో మట్టిని తిరగబెట్టి విత్తనాలు చల్లుతున్నారు. ఆకుకూరలు సాగు చేసిన చోట అవిపూర్తి అయ్యాక మళ్లీ తోటకూర, పాలాకు, గోంగూర విత్తనాలు వేస్తున్నారు. హార్టీకల్చర్ వారు సరఫరా చేసిన 12 రకాల మొక్కలను పెంచుతున్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఆస్పత్రికి కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హామీ ఇచ్చారు. శుక్రవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన డాక్టర్లు, సిబ్బంది, సెక్యూరిటీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్లతో సమీక్షించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వైద్య విధాన పరిషత్ కింద నడుస్తున్న ఈ ఆస్పత్రిలో డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఆస్పత్రికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, డాక్టర్లను, స్టాఫ్‌నర్సులను, సిబ్బందిని నియమిస్తామన్నారు. ఆస్పత్రి స్థితిని సీఎం చంద్రబాబు నాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీకి తెలిపామని, వారు సానుకూలంగా స్పందించారన్నారు. రూ.30 లక్షలకు మందులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని, ఇది తప్పకుండా అనుమతిస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోటేశ్వరి, ఆర్ఎంఓ షకూర్, డాక్టర్లు, టీడీపీ నేతలు షంషీర్, శివన్న, జాన్‌బాబు, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

మోసగించిన ముగ్గురిపై కేసు నమోదు



నిందితుడు రాజేష్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అమ్మాయిని మోసగించిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. పోలీసుల కథనం మేరకు కురబలకోట మండలంలో ఓగ్రామానికి చెందిన ఓ అమ్మాయి కిడ్నీ స్పెషాలిటీ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తున్న సమయంలో ఓఆస్పత్రి మేనేజరు రాజేష్‌రెడ్డి నమ్మించి గర్భవతిని చేశాడు. ముందే వివాహమైనా ఈ అమ్మాయిని కూడా పెళ్లి చేసుకున్నాడు. భయభ్రాంతులకు గురి చేసి అబార్షన్ చేయించాడని తెలిపారు. ఈ తంతు అంతా తెలిసిన అంగళ్లు ఆర్ఎంపీ డాక్టర్ రాయుడు, సంజీవని ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ రవికుమార్‌రెడ్డి అమ్మాయిని బెదిరించారు. వారి వత్తిడిని తట్టుకోలేక నర్సు జాబును వదిలేసిన ఆమెకు ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితిలో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు విచారణ చేపట్టిన సీఐ నిందితులు రాయుడు, రాజేష్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణలో ఉంది.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కు ఘన సన్మానం

మదనపల్లె అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్‌ను శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్, లారీ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జింకా వెంకటాచలపతి, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు, బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్, మదనపల్లె రెడ్డి సంఘం నేతలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నేతలు అనిల్‌కుమార్‌రెడ్డి, బాలగంగాధర్, వాల్మీకి సంఘం నేతలు ముత్తరాశి హరికృష్ణ, పులి శ్రీనివాసులు, వీఎస్‌రెడ్డి, చైతన్య సేవా సంస్థ ఎంపీ ఆనందన్, కవితారాణి, పోర్టు సంస్థ డైరెక్టర్ లలితమ్మ సీపీఎం శ్రీనివాసులు, వైసీపి నాయకులు తట్టి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీ.. హెడ్‌కానిస్టేబుల్ మృతి



దువ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడమడక చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఏఆర్‌హెడ్‌కానిస్టేబుల్ బండి నారాయణ (50) మృతి చెందాడు. పోలీసుల వివ రాల మేరకు.. విధుల్లో భాగంగా బండి నారాయణ చెక్‌పోస్టు వద్ద ఉండగా హైదరాబాదు నుంచి కడప వైపు వెళుతున్న కావేరి ట్రావెల్స్ బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో చాగలమర్రిలోని కేరళ ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

23న ప్రవేశ పరీక్ష

సీకేదిన్నె, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహిస్తున్నట్లు పరీక్షల సమన్వయకర్త ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఈ పరీక్ష దరఖాస్తు చేయనివారు 23వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే 8 పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2గంటలకు నేరుగా హాజరై సర్టిఫికెట్లు,పాస్‌పోర్టుసైజు ఫొటో, రూ.500 నగదు చెల్లించి పరీక్ష రాయవచ్చన్నారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 3 నుంచి కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్‌లో జరగనున్న 10వ తరగతి మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలని యూటీఎఫ్ ప్రతినిధులు డీఈవో షంషుద్దీన్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో ఆయను కలిసి వినతి పత్రం సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, ప్రతినిధులు నరసింహరావు, రమణ, గోపినాథ్, వీరనారాయణ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే అడవుల సంరక్షణ : డీఎఫ్ఓ



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఒకపక్క స్మగ్లర్లు మరో పక్క అగ్ని ప్రమాదాలతో అడవులు నానాటికి అంతరించి పోతున్నాయని... అడవులను తిరిగి సంరక్షించుకోవాలంటే ప్లాంటేషన్ ద్వారానే సాధ్యమవుతుందని జిల్లా అటవీశాఖ అధికారి వినిత్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తన చాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మొక్కల పెంపకం అంటే ఎక్కువమంది పండ్ల మొక్కల గురించి అడుగుతున్నారు తప్ప అటవీ మొక్కల గురించి ఏ ఒక్కరు అడగడం లేదన్నారు. ఇళ్ల వద్ద మనం పెంచుకునే పూల, పండ్ల మొక్కలు వల్ల పక్షులకు కూడా పెద్దగా ప్రయోజనం ఉండ దన్నా రు. ప్రైవేటు నర్సరీలలో అటవీ మొక్కలు లభించ వన్నారు. అందుకోసమే అడవులలో ఉండే పెద్ద పెద్ద వివిధ జాతులకు సంబంధించిన చెట్ల నుంచి విత్తనాలు సేకరించి అటవీశాఖ నర్సరీలలో మొక్కల పెంపకం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కాగా, కలెక్టర్ నేతృత్వంలో వివిధ శాఖల అధి కారుల సమన్వయంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కల పెంపకం చేపడుతామన్నారు. జూన్ జూలై మాసాల్లో ప్రజల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. పర్యావరణ సమ తుల్య త మొక్కల పెంపకం, వాటి ఆవశ్యకతపై ప్రజలకు ప్రధానంగా యువతకు అవగాహన కల్పించి మొక్కలు నాటే కార్యక్రమంలో వారిని భాగస్వా మ్యం చేయను న్నట్లు డీఎఫ్ఓ వివరిం చారు. మొక్కల పెంప కంలో నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేష న్స్ (ఎన్జీఓలు) భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరులోని ఎకో పార్కు వద్ద రూ.84 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి.. అందులోనే నగరవనం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

జిల్లాలోని అవధూత కాశినాయన స్వామి ఆశ్రమంలో భవనాల తొలగింపునకు 2023 లోనే ఉత్తర్వులు వెలువడ్డాయని చెప్పారు. తిరిగి అక్కడ భవనాలు నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం స్థలం మంజూరు చేసిందని.. ఇందుకు సంబం ధించిన ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. వైసీపీ నేత సజ్జల రామ కృష్ణారెడ్డికి సంబంధించిన అటవీ భూముల ఆక్రమణకు సంబంధించి ఆయన స్పందిస్తూ ఆ భూముల సర్వేకి ఒక కమిటీని ఏర్పాటు చేశారని.. ఆ కమిటీ నివేదిక ఆధారంగానే స్పష్టత వస్తుందన్నారు. అలాగే కడప నేటివ్ ఫారెస్ట్ రెస్టోరేషన్ ప్రాజెక్టు పోస్టర్ ఆవిష్కరించారు. ప్రొద్దుటూరు, బద్వేలు సబ్ డీఎఫ్‌ఓలు దివాకర్, స్వామి వివే కానంద, బద్వేల్, కడప పోరుమామిళ్ల, ప్రొద్దుటూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు ప్రసాద్, రఘునాథరెడ్డి, హేమాంజలి, తదితరులు పాల్గొన్నారు.

యువత ద్వారానే సమాజంలో మార్పు

- స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శంకర్



ప్రసంగిస్తున్న స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ శంకర్

కడప మారుతీనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశానికి వెన్నెముకగా భావించే యువత బలంగా వుండడం ద్వారా సమాజంలో మంచి మార్పు వస్తుందని స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ నేషనల్ యూత్ ఫెస్టివల్-2025 కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వ యువజన క్రీడా వ్యవ హారాలశాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేం ద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ ఆధ్వర్యం లో శుక్రవారం స్థానిక కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో వికసిత్‌భారత్ జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై యువతీ, యువకులకు ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందు లో ఉమ్మడి కడప జిల్లా నుంచి 142 మంది యువ తీ, యువకులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పసుపులేటి శంకర్ హాజరై మాట్లా డారు. భారతదేశంలోని యువత శక్తి సామర్థ్యా లను వెలికితీసేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పోటీ లు నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో యువత వారి ఆలోచన విధానాన్ని బయటి ప్రపంచానికి చెప్పేందుకు ఒక అవకాశంగా మలచుకోవాలన్నారు. అనంతరం నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ మాటాడుతూ దేశాన్ని అభివృద్ధి బాటలో పయనింపచేసేది యువతే అన్నారు. దేశ పురోగతి సాధించాలంటే యువత వారి శక్తి సామర్థ్యాలను వెలికి తీయాలన్నారు. కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, వైవీయూ ఎన్ ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మయ్య, గంగాధర్, డాక్టర్ పార్వతి, వేణుగోపాల్, డాక్టర్ కె.అపర్ణ, రషీదా, రూప, సానియా తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో ఎంబార్కేషన్ రద్దు

- 100 మంది లోపే దరఖాస్తు చేయడంతో నిర్ణయం

విజయవాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): హజ్‌యాత్రకు విజయవాడ విమానాశ్రయంలో ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రద్దు చేసింది. చాలా తక్కువ సంఖ్యలో హజ్ యాత్రికులు విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించటానికి దరఖాస్తు చేసుకోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. రాష్ట్రం నుంచి గణనీయమైన స్థాయిలోనే హజ్ యాత్రికులు వెళుతున్నా.. విజయవాడ విమానాశ్రయాన్ని తక్కువగా ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఏపీకి చెందిన ఎక్కువ మంది హైదరాబాద్ విమానాశ్రయం నుంచే హజ్‌యాత్రకు వెళ్తున్నారని తెలుస్తోంది. విజయవాడ కంటే హైదరాబాద్ నుంచి విమాన టికెట్లు, ఇతర ప్యాకేజీల ధరలు చాలా తక్కువగా ఉండటమే దీనికి కారణం. విజయవాడ విమానాశ్రయంలో మొదటిసారిగా ఎంబార్కేషన్ పాయింట్ వచ్చినపుడు 1800 మంది హజ్‌యాత్రికులు ఈ విమానాశ్రయం నుంచి ప్రయాణించారు. ఆ తర్వాతి ఏడాది 900 మంది ప్రయాణించగా.. ప్రస్తుతం 100 మంది లోపు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఎంబార్కేషన్ పాయింట్ ఇవ్వాలంటే కనీసం 300 మంది ఇక్కడి నుంచి ప్రయాణించాల్సి ఉంటుందని సమాచారం. శంషాబాద్ విమానాశ్రయం కంటే విజయవాడ విమానాశ్రయం నుంచి విమాన టికెట్, ఇతర ప్యాకేజీ ధరలు ఎక్కువగా ఉండటం వల్లే హజ్ యాత్రికుల్లో అత్యధికులు శంషాబాద్‌కు చాయిస్ ఇచ్చినట్టు తెలుస్తోంది.

సరికొత్త ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలి : వీసీ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలతో ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇన్ బయాలజీపై సైన్స్ అకాడెమీస్ లెక్చర్ వర్క్‌షాప్ ముగింపుసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం ద్వారా విప్లవాత్మకమైన మార్పునకు ప్రభుత్వం తెరతీసిందని.. ఇకపై విద్యార్థులు కష్టపడడం మీద దేశభవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ కలలు కన్న వికసత్ భారత్ సహకారం కావాలంటే విలువైన పరిశోధనలు రావాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రెండు రోజుల వర్క్‌షాప్‌లో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేలా అకాడమీల సైంటిస్టులు లెక్చర్స్ ఇచ్చారన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ రాజగోపాల్ ఆర్గనైజేషన్స్ అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రియాజున్నీసా, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మాదక్క, మాధవరెడ్డి, దాక్షాయిని, టి.చంద్రశేఖర్, ఎ.చంద్రశేఖర్, మునికుమారి, తదితరులు పాల్గొన్నారు.



హార్సిలీహిల్స్‌లో కలుసుకున్న సీనియర్ డాక్టర్ల బృందం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- 50 ఏళ్ల కిందటి వైద్యవిద్యార్థుల బృందం ఆత్మీయసమావేశం

బి.కొత్తకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో పలు రంగాల పూర్వ విద్యార్థుల ఆత్మీయకలయిక, వివిధ కంపెనీల ఆధ్వర్యంలో ఈవెంట్‌లు మామూలే. అయితే కాస్త కొత్తగా రిటైర్మెంట్ వయస్సు దాటిన నేటి వైద్యబృందం, 50ఏళ్ల నాటి వైద్యవిద్యార్థుల బృందం శక్రవారం ఆత్మీయసమావేశం జరిగింది. ఈ బృందంలోని సభ్యులైన ఆళ్లగడ్డకు చెందిన కాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రం దావణగెరె పట్టణంలోని జేజేఎంసీ మెడికల్ కాలేజిలో 1965-70లో తాము వైద్యవిద్యను చదివామన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఆయా ప్రాంతాల్లో వైద్యవృత్తిలో వుంటున్నామన్నారు. తమకు వయసు మీరినా విద్యార్థి దశలో ఉన్న ప్రేమాభిమానాలతో 2007 నుంచి ప్రముఖ ప్రదేశాల్లో ఇప్పటికీ ఏడు సార్లు ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, సరదాగా గడపటం మనసుకు స్వాంతన చేకూరుస్తుందన్నారు. హార్సిలీహిల్స్‌లో రెండురోజుల పాటు విడిది చేసి తమ స్వస్థలాలకు వెళతామన్నారు. ప్రముఖ వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివకుమారి, మరో 35 మంది సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు : పీడీ



బహిరంగ సభలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం

వాల్మీకిపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కూలీల కోసం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల కల్పనలో అవినీతి చోటు చేసుకుంటే చర్యలు తప్పవని ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం హెచ్చరించారు. మండల వ్యాప్తంగా సామాజిక తనిఖీ గ్రామసభల అనంతరం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కూలీలకు పనుల కల్పన, ఎప్పటి కప్పుడు బిల్లులు చెల్లింపులు, సమగ్రంగా ఉండేలా స్థానిక ఉపాధి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2023-24 ఉపాధి ద్వారా మొత్తం 1387పనులు పూర్తి చేశారన్నారు. కూలీలకు రూ.6.72కోట్లు చెల్లించగా పరికరాల నిమిత్తం రూ.3.23కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మండలంలో పనుల అవకతవకలపై రూ.1,34,843లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధి సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ కూలీలకు పనుల కల్పన, సౌకర్యాలు బాధ్యతగా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు కూలీలకు చెల్లింపులు జరిగిపోవాలన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నేతలు, కూలీల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ మనోహర్‌రాజు, ఎస్ఆర్‌పీహెచ్ సుబ్బారావు, ఏపీఓ సునీల్‌కుమార్, వైస్ ఎంపీపీ వెంకటరమణ, వివిధ పార్టీల నేతలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడే వారినే సాధికార సారధులుగా నియమించాలి

- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడిన వారినే కుటుంబ సాధికార సారధులుగా నియమించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల టీడీపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సాధికార సారధుల వ్యవస్థ ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి 60 ఓటర్లకు ఇద్దరు చొప్పున కుటుంబ సాధికార సారధులను నియమించాలన్నారు. రాష్ట్ర, పార్లమెంటు, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులుగా ఉండాలన్నా ఖచ్చితంగా కుటుంబ సాధికార సారధులుగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మెన్ కేవీ రమణ, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు భజంత్రి రామాంజులు, నేతలు మూగి రవిచంద్ర, ఎల్‌ఐసీ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బినాయుడు, చాంద్‌బాషా, పాల రాము, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ సమస్యలు పరిష్కారం : ఎస్ఈ

పెద్దమండ్యం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తుగా పలు సబ్ స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. బండమీదపల్లి పంచాయతీ తురకపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్, ముసలికుంట సబ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన కొత్త అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్, కెపాటీసీ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ప్రారంభించిన ఎస్ఈ మాట్లాడుతూ ఈట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరిందన్నారు. వ్యవసాయం, ఇళ్లకు మెరుగైన విద్యుత్తు సరఫరా జరుగుతుందన్నారు. ఎండ వేడిమి వేళ సబ్‌స్టేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లలో విద్యుత్తు వేళలు సరఫరా వివరాలను అందుబాటులో పెట్టుకోవాలన్నారు ట్రాన్స్‌కో డీఈ గంగాధరం, ఏడీ సురేంద్రనాయక్, ట్రాన్స్‌కో ఏఈ రామ్మూర్తినాయక్, సీటీఆర్ సూరీ, ఎల్ఐ రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోర్సులపై ఎంజేఆర్‌లో అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ ట్రైనర్ దివ్య

పీలేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి అవసరమైన కోర్సుల గురించి ఎంజేఆర్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ(ఏపీఐటీఏ), ఫేస్ ప్రెప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఫేస్ ప్రెప్ సంస్థ అసోసియేట్ టెక్నికల్ ట్రైనర్ విద్య విద్యార్థులకు లింక్డ్ ఇన్ ప్రొఫైల్స్ క్రియేట్ చేయడం, పలు ఆన్‌లైన్ కోర్సుల గురించి తెలియజేశారు. కళాశాల చైర్మన్ ఎం.వి.అవినాశ్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తాజా కోర్సుల గురించి తెలియజేయాలన్న లక్ష్యంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎస్‌వీఎన్ రావు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యక్షా...!



- **అసెంబ్లీలో పీలేరు గొంతుక !**
- **ప్రధాన సమస్యలపై ప్రస్తావనలు**
- **గతంలో ఎప్పుడూ వినపడని వైనం**

కలికిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల గురించి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి శాసన సభలో బలంగా వినిపించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పదిహేను రోజులు జరిగి గురువారంతో ముగిసిన బడ్జెట్ సమావేశాల్లో ఆయన పీలేరు ప్రజా సమస్యల గురించి ఐదు రోజులు ప్రస్తావించారు. జిల్లా వ్యాప్తంగా వైసీపీ ప్రజా ప్రతినిధులు ప్రారంభించిన తాగు నీటి శుద్ధి కేంద్రాలు నిరుపయోగమైనట్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. వేసవిలో నీటి శుద్ధి కేంద్రాలు వాడుకలోకి వస్తే కొంతలో కొంతైనా దాహార్తిని తీర్చగలవని వివరించారు.

● కలికిరి జేఎన్టీయూ కళాశాలను యూనివర్శిటీగా ఉన్నతీకరించాలి. దీంతో జిల్లాలో యూనివర్సిటీ లేని కొరత తీర్చాలని కోరడంతో మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు.

అడవిపల్లె, ఝరికోన నిర్వహణ

హంద్రీ నీవా జలాల కోసం నిర్మించిన అడవిపల్లె రిజర్వాయర్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని కిశోర్‌కుమార్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లాకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రూ.వేల కోట్లు ఖర్చు పెట్టినా ఇప్పటికీ నికర జలాలు అందుబాటులోకి రాలేదని కేవలం రూ.283 కోట్లు వెచ్చిస్తే హంద్రీ నీవా పూర్తవుతుందని చెప్పారు. స్పీకర్ రఘు రామ కృష్ణరాజు సమర్థిస్తూ మరో రూ.283 కోట్లతో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందే పక్షంలో వెనుకాడాల్సిన పనిలేదని సూచించారు. నియోజకవర్గానికి తాగునీటి ప్రధాన ఆధారమైన ఝరికోన ప్రాజెక్టు ఐదేళ్ళుగా నిరుపయోగమైందని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. కేవలం రూ.4 కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టు నుంచి తాగు నీరు నిరంతరాయంగా సరఫరా అవుతుందని వివరించారు.

టమోట రైతులను ఆదుకోవాలని...

రాయలసీమ జిల్లాల్లో లక్షలాది ఎకరాలు సాగుచేస్తున్న టమోట రైతులను ఆదుకోవాలని కిశోర్‌కుమార్ రెడ్డి అసెంబ్లీలో కోరారు. ధరలు పూర్తిగా పతనమైన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వమే టమోటాలు కొనుగోలు చేసి రైతులకు ఊరట కల్పించాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో కమీషన్ల సంస్కృతిని అడ్డుకోవాలని చెప్పారు.

ఇదే మొదటిసారి

కీలకమైన ప్రధాన సమస్యలను ప్రస్తావించడం ద్వారా పీలేరు ప్రజల గొంతును అసెంబ్లీలో బలంగా వినపించడంలో కిశోర్‌కుమార్ రెడ్డి కృతకృత్యులయ్యారని పలువురు చెపుతున్నారు. పీలేరు ప్రజల గొంతు శాసన సభలో బలంగా వినిపించడం ఇదే మొదటిసారని అంటున్నారు.

24న దినసరి మార్కెట్టు, బస్టాండు గేటు వేలం

తంబళ్లపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో దినసరి మార్కెట్టు, బస్టాండు గేటు(ఆర్టీసీ మినహా) రుసుము వసూలు హక్కులను ఏడాది పాటు పొందేందుకు 24వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నీలూఫర్ ఫైనుద్దీన్, కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఎటువంటి పన్నులు బాకీ ఉండకూడదన్నారు. ఏ కారణం తెలపకనే వేలం నిలుపుదల చేసి వాయిదా వేసే హక్కు కార్యదర్శికి ఉంటుందన్నారు. హెచ్చు పాటదారుడు వేలం ముగిసిన వారం రోజుల్లో నగదు మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని, పాల్గొనే వారు రూ.50వేలు ధరావతు చెల్లించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్షయను నిర్మూలిద్దాం

వాల్మీకిపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి క్షయ వ్యాప్తిని అరికట్టే దిశగా బాధ్యత చేపట్టాలని వాల్మీకిపురం మండల హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ పిలుపు నిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక కోనేటివీధిలో శిక్షణలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి క్షయ కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ రోహిణి, టీబీ సూపర్‌వైజర్ నాగిరెడ్డి, వైద్య సిబ్బంది భూపతి, పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బి.కొత్తకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గురుకుల విద్యాలయంలో 2025-26కు 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషలాఫీసర్ విశ్వలత పేర్కొన్నారు. 22నుంచి ఏప్రిల్ 11వరకు అవకాశం ఉందన్నారు. 6వ తరగతి, 7వ తరగతిలో 3, ఎనిమిదిలో 2, తొమ్మిదిలో4, పదవతరగతిలో 9 సీట్లు ఖాళీలు వున్నాయన్నారు. అనాధలు, బడిబయట వున్న పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో దారిద్ర్యరేఖకు దిగువన వున్న బాలికలు అర్హులని ఆమె తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న బాలికలకు సమాచారం ఇస్తామన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు పోషణతో కూడిన విద్య

బి.కొత్తకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌కేంద్రాల్లో చిన్నారులకు పోషణతో కూడిన విద్యను అందిస్తారని సీడీపీఓ సుజాత పేర్కొన్నారు. బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్‌బీ-పడాయిబీలో భాగంగా శిక్షణ నిర్వహించారు. సూపర్‌వైజర్లు హిజాద్‌ప్యారీ, గౌరీదేవి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల కన్వీనర్‌గా ఫిరోజ్

గుర్రంకొండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఫిరోజ్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ తెలిపారు. గుర్రంకొండ వాసి ఫిరోజ్‌ను పార్టీ కన్వీనర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. గుర్రంకొండలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కృషి చేయాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నిమ్మనపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వెంకోజిగారిపల్లిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమవడంతో అధికారులు గ్రామంలో పర్యటించారు. బొంగవారిపల్లి, అంబేడ్కర్‌కాలనీ, వెంకోజిగారిపల్లిలో పర్యటించి తాగునీటి సమస్యపై ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ సక్రమంగా లేకపోవడం, పైపుల్లో చెట్లవేర్లు చేరి తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. పైపులైన్‌లో వున్న చెత్త, చెదారం, చెట్లవేర్లను తొలగించే వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. సోమవారంలోగా తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మిధున్‌చక్రవర్తి, కారదర్శి రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో క్యాంపస్ సెలెక్షన్లు

కలికిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్లలో వంద శాతం మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. 2024-25 బ్యాచ్ విద్యార్థులు ఈసీఈ విభాగం నుంచి 55 మంది, ఈఈఈ విభాగం నుంచి 23 మంది హాజరవగా మొత్తం 78 మంది ఎంపికయ్యారు. వంద శాతం విద్యార్థులు ఎంపికవడం ఇదే మొదటిసారని ప్రిన్సిపాల్ చెప్పారు. ఎంపికైన వారికి ఉద్యోగ విజయోత్సవం-2025లో బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ నియమాకపత్రాలు అందజేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులు, కళాశాల విభాగాధిపతులు శివరాకృష్ణ, బి.సాంబశివా రెడ్డి, పి.రఘు, ఏఓ కల్యాణి, ఇత ర అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేషాలంకరణ



మదనపల్లె అర్బన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకుడు సుష్మిత్ సాయి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు రాహుకాల సమయంలో పసుపు, కుంకుమ్మ, చీర, జాకెట్లు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మెక్కు తీర్చుకున్నారు. అనంతరం నిమ్మకాయలపై నెయ్యివత్తులతో దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, తదితరులు పర్యవేక్షించారు.

ఆటో బోల్తాపడి 10మందికి గాయాలు



కురబలకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి 10మంది గాయ పడ్డారని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే...

సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లె మహిళలు ఉదయం కురబలకోట మండలం కనసానివారిపల్లె సమీపంలో టమోటా కాయలు కోయడానికి వచ్చి తిరిగి స్వగ్రా మానికి వెళుతుండగా బ్రాహ్మణొడ్డుపల్లె వద్ద అటో అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన వారిని 108 సాయంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగండి

- **ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జే.ఏ. చౌదరి**



మాట్లాడుతున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చౌదరి

కురబలకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలను స్థాపించి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించాలని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జే.ఏ చౌదరి, కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించే జాతీయ ఐపీ యాత్రను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఇంటలెక్చ్యువల్ ప్రాపర్టీ రైట్స్ విలువ అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకుంటూ నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి టెక్నాలజీకి కమ్యూనికేషన్ చాలా అవసరమని కనెక్ట్ కొలాబిరేషన్, మెంటరింగ్, మార్కెటింగ్ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. అందుకు కావాల్సిన అన్ని వసతులను కళాశాల కల్పిస్తుందన్నారు. నూతన ఆలోచలనలను, టెక్నాలజీలకు పేటెంట్‌ను, కాపీరైట్స్ ద్వారా భద్రత కల్పించాలన్నారు. మేధో సంపత్తి భవిష్యత్‌ను ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమం వేదికగా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సృజనాత్మక రచనలను రక్షించడం, సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలు, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామన్నారు. వర్క్‌షాప్‌లో భౌగోళిక సూచికలు, ట్రేడ్ మార్క్‌లు, కాపీరైట్స్, పేటెంట్ సహా మేధో సంపత్తి హక్కుల కీలక అంశాలను నిపుణులు తెలియజేశారు. పరిశోధకులు, విద్యావేత్తలు, వ్యవస్థాపకులు చట్టపర సలహాదారులు, ఇంక్యుబేషన్ మేనేజర్‌లకు ప్రయోజనం చేకూర్చేలా వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు వికసిత్ భారత్ ఆశయాలను స్థాపించవచ్చని, దేశాన్ని గ్లోబల్ మ్యానుఫాక్షరింగ్ హబ్‌గా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం న్యూ ఏఐ వెంచర్ స్టుడియో స్థాపనకు కళాశాలతో ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమం లో ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి ప్రెసిడెంట్ ఎన్. ధ్వారకనాథ్, ప్రిన్సిపాల్ యువరాజ్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఎల్..ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న పీడీ రమాదేవి

పీలేరు, మార్చి 21 (ఆంధ్ర జ్యోతి): శిక్షణను సద్వినియోగం చేసుకుని బోధనా సామర్థ్యాలను మెరుగు పరుచుకోవాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలిపారు. జూనియర్ కళాశాలలో అంగన్‌వాడీ టీచర్ల శిక్షణా తరగతులను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ సుశిక్షితులైన టీచర్ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను అభ్యాస కేంద్రాలుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిక్షణ నిర్వహిస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించి వారికి చదువుపై ఇష్టం పెరిగేలా చేయడమే శిక్షణ లక్ష్యమన్నారు. శిక్షణలో నేర్పుతున్న అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం, ఆకళింపు చేసుకుని తమ కేంద్రాల్లో అమలు చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం శిక్షణలో తెలుసుకున్న అంశాలపై పలువురు టీచర్లను అడిగి తెలుసుకున్నారు. సూపర్‌వైజర్లు అక్కాయమ్మ, స్వరూప, స్వర్ణ, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు సుమలత

తంబళ్లపల్లె, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నోటిని శుభ్రంగా ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తంబళ్లపల్లె ప్రభుత్వాస్పత్రి దంత వైద్యురాలు సుమలత అన్నారు. శుక్రవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో నోటి శుభ్రతపై రోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు విక్రాంత్‌రెడ్డి, అమరసింహరాజు, హెడ్ నర్సు గ్లోరీ, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

'నిఘా పెట్టడం అన్యాయం'

మదనపల్లె అర్బన్ మార్చి21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పోరాడుతున్న దళిత నేతలపై పోలీసులు నిఘా పెట్టడం అన్యాయమని దళిత నేతలు అన్నారు. స్థానిక మాల మహానాడు కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాయలసీమ మాలల సింహగర్జన సభ తాత్కాలిక వాయిదా పడిందన్నారు. భవిష్యత్‌లో దళిత ఉద్యమ నేతలు, మాల సంఘాలతోనే సభ నిర్వహిస్తామన్నారు. మాల జేఏసీ అధ్యక్షుడు యమలా సుదర్శనం, ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్, సహాయ కార్యదర్శి పాకూరి చిరంజీవి సభ ఏర్పాటుకు కమిటీ వేస్తామన్నారు.

ఎస్సీలకు సురక్షిత పిచికారీ కిట్లు పంపిణీ

పీలేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బాలంవారిపల్లె పంచాయతీ హరిజనవాడల్లోని ఎస్సీ రైతులకు వ్యవసాయాధికారులు శుక్రవారం సురక్షిత పిచికారీ కిట్లు పంపిణీ చేశారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కార్తీక్ రెడ్డి, ఉద్యాన విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్ కిట్లను ఉపయోగించే పద్ధతులను రైతులకు తెలిపారు. పంటలకు ఏఏ మందులు ఎంత మోతాదులో కలుపుకోవాలో ప్రదర్శన ద్వారా వివరించారు. రైతుల పొలాలను సందర్శించి ఆయా పంటల దిగుబడి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, చిట్కాలను రైతులకు తెలియజేశారు. ఏఓ రమాదేవి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేంద్రనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ నుంచి 129 మంది పోలీసులు బదిలీ

మదనపల్లె టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పోలీసు సబ్ డివిజన్ నుంచి 129 మంది పోలీసులను బదిలీ చేస్తూ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. 12 మంది ఏఎస్ఐలు, 41 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 76 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వీరిలో దీర్ఘకాలంగా ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్న వారిని, ఆయా మండలాల చుట్టుపక్కల తిష్టవేసుకున్న వారిని ప్రత్యేకంగా రాజంపేట, రాయచోటి సబ్‌డివిజన్లకు బదిలీ చేయడం గమనార్హం. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా కొందరు పోలీసులు వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేస్తుండడం, పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణ వైసీపీ నేత చేతిలో హత్యకు గురికావడంతో రాష్ట్ర ప్రభుత్వం పోలీసు అధికారులు, సిబ్బంది బదిలీలపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలోని వన్ టౌన్, టు టౌన్, తాలూకా, రూరల్‌పోలీసు సర్కిల్ పరిధిలో పనిచేస్తూ తిష్ట వేసుకున్న వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. అందులో ఎక్కువ భాగం హెడ్‌కానిస్టేబుళ్లే వుండడం చర్చనీయాంశంగా మారింది.

ములకలచెరువు స్టేషన్‌లో...

ములకలచెరువు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ఏఎస్ఐ భాస్కర్‌నాయక్ బి.కొత్తకోటకు, హెడ్‌కానిస్టేబుళ్లు శంకర్‌నాయక్ చిట్వేలికి, రెడ్డిమోహన్ కేవీ పల్లెకు, కానిస్టేబుళ్లు సిరాజ్‌బాష ముదివేడుకు, మహేంద్రకుమార్ వాయల్పాడ్‌కు, వెంకటేష్ నిమ్మనపల్లెకు బదిలీ చేశారు.

నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌లో...

నిమ్మనపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌లు రమేష్, చక్రవర్తి, శివరామకృష్ణ, మహ్మద్, కానిస్టేబుల్‌లు హరి, రెడ్డిబాషా, నందకుమార్, సుధాకర్, రామచంద్ర, శ్రీరాములు, నరేష్, రాజేష్, శ్రీనివాసులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో 15 మంది వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దమండ్యం పోలీస్‌స్టేషన్‌లో...

పెద్దమండ్యం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం స్టేషన్‌లో ఆరుగురు పోలీసులు బదిలీ అయ్యారని ఎస్ఐ రమణ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్‌లు శ్యాంప్రకాష్, శివ చైతన్య, కానిస్టేబుల్‌లు కిరణ్‌కుమార్, సుబ్రమణ్యం, మధుకర, కిశోర్ బదిలీ అయినట్లు తెలిపారు. వారి స్థానాల్లో నలుగురు కానిస్టేబుల్‌లు వస్తారని సమాచారం.

కలికిరి పోలీస్‌స్టేషన్‌లో...

కలికిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కలికిరి ఏఎస్ఐ ఎస్.మధుసూదనాచారి ముదివేడుకు, హెడ్ కానిస్టేబుళ్లు పి.మనోహర్, ఎ.కొండప్ప మదనపల్లె తాలూకాకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఫ్యాక్షన్ జోన్ నుంచి డి.వి.సుబ్బారెడ్డి, కలకడ నుంచి ఎన్.రెడ్డిబాబు బదిలీ చేశారు. కానిస్టేబుళ్ళు సి.అమరనాథ్, కె.వెంకటసిద్దులు, వి.సుబ్రమణ్యం నిమ్మనపల్లెకు, జె.శివకుమార్‌ను మదనపల్లె తాలూకాకు, పి.మునిరత్నం మదనపల్లె 2టౌన్‌కు, డి.తేజోవతి వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. వీరి స్థానంలో పీలేరు, మదనపల్లె, సంబేపల్లె నుంచి సిబ్బంది వస్తారు.

కార్యదర్శులకు పనివత్తిడి తగ్గించాలి

నిమ్మనపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని శుక్రవారం ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ సచివాలయాల ద్వారా నిర్వహించే వివిధ రకాల సర్వేలు మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, పి4సర్వే, హౌస్‌హోల్డ్ సర్వే, ఏపీ రెసిడెంట్స్ సర్వే, ఆరేళ్ల పిల్లలకు మిస్సింగ్ ఆధార్ సర్వే, తదితర సర్వేలతో వత్తిడి ఎక్కువై పంచాయతీల అభివృద్ధికి ఆటంకం కలుగుతోందన్నారు. పనిభారం తగ్గించేందుకు వాటి నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు మారెప్ప, గౌతమి, గాయత్రి, రాజేష్, వెంకటరమణ, శ్రీనాధ్, తస్లీమ్‌నౌరీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లను గుర్తించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

కలకడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో అక్రమ లేఔట్లను అధికారులు గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ, క్రిష్టప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ అబ్దుల్‌రహీంకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడుతూ అత్యాశతో ప్రభుత్వ భూములు, కాల్వలు ఆక్రమించిన రియల్ వ్యాపారులపై పోలీస్ కేసులు నమోదు చేయించాలని కోరారు. నిబంధనలు పాటించకుండా క్రయవిక్రయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మహబూబ్‌వలి, సూరజ్ పాల్గొన్నారు.